# శ్రీ గురుపాదుకాస్తవము

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2007

ప్రతులు : 1,000

వెల : రూ॥ **30-00**

*ప్రాప్తిస్థానము :*

**జగద్గురు మందిరము**

(ది వరల్డ్ టీచర్ టెంపుల్)

'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,

విశాఖపట్నం - 530 002.

*ముద్రణ :*

ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్

విశాఖపట్నం - 530 016.

☏ 0891-2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**“ధనిష్ఠ”** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్చుచేసి వ్యాప్తి చేయుటకు “ధనిష్ఠ” 1992లో జన్మించినది.

**“ధనిష్ఠ”,** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, గ్రంథముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**“ధనిష్ఠ”** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - “జగద్గురు మందిరము” గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్*

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలో గల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాక నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టర్ పార్వతీకుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

మాస్టర్ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతులైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడి పించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ ఫౌండేషన్**

# ముందుమాట

ఆదిశంకరులు పన్నెండు పద్యములలో, ద్వాదశమూర్తిగ గురుమూర్తి నారాధించుటకు గంభీరమగు స్తుతి నిచ్చినారు. గురుతత్త్వమనగా పరతత్త్వమే అని స్పష్టము గావించినారు. పరుని ఎరిగినవాడే గురువని తెలిపినారు. పరుడే రూపము కట్టిన గురుడని తెలిపినారు. గురుడు పరమునకు మార్గమని తెలిపినారు. ఇందు చేయబడిన ప్రశంస అంతయు పరునకే వర్తించును. అదియే గురువని నిర్వచించినారు. రూపమాధారముగ తత్త్వముతో అనుసంధానము చెంది తన్మయ మగుడని తెలిపినారు.

గురు శుశ్రూష, గురుపాదుకా నమస్కారము, గురువు ఎడల విధేయత ఆధారముగ గురుశిష్య సంప్రదాయము విరాజిల్లు చున్నది. ఆదిశంకరులు సద్గురు వెట్లుండునో ప్రామాణికముగ తెలిపినారు. ఈ ప్రమాణములను కలిగినవారే సద్గురువులని తెలిపినారు. శిష్యులకు కూడ గురుతత్త్వమును రూపమాధారముగ తెలియుడని తెలిపినారు. ఆదిశంకరులు గురుతత్త్వమే పరతత్త్వ మని, దాని నెరుగుటకు గురురూపము సౌలభ్యమని తెలిపినారు. గురు రూపమునకు, గురుతత్త్వమునకు సమానమగు భక్తిశ్రద్ధలను చూపుట సద్బుద్ధి. తత్త్వము ననుసరించి రూపమును నిర్లక్ష్యము చేయుట, రూపము ననుసరించి తత్త్వమును నిర్లక్ష్యము చేయుట

అసమగ్ర సాధన. ప్రకృతి, పురుషులను సమానముగ ఆరాధించుట వలననే రెండింటికిని మూలమైన తత్త్వము తెలియును.

గురుపాదుకాస్తవమును ప్రాతఃకాలమున పారాయణ చేయు శ్రద్ధాళువు లెందరో కలరు. వారి కోరిక మేఱకు క్లుప్తముగ ఈ వివరణ మీయబడినది. వారియందరి భక్తిశ్రద్ధలకు ఈ ప్రయత్నము సమర్పితము.

ఈ ప్రచురణను **శ్రీమతి లక్ష్మీప్రసన్న, శ్రీ రామకోటేశ్వరరావు** దంపతి తమ కుమారుని వివాహ సందర్భమును పురస్కరించుకొని 'గురుసమర్పితము'గా ప్రచురించిరి. వారికి, వారి కుటుంబమునకు గురు అనుగ్రహము కలుగవలెనని ఆశంస.

మార్గశీర్ష తదియ
గురువారము

**- మాస్టర్ పార్వతీకుమార్**

# శ్రీ గురుపాదుకాస్తవము

1. శ్రీ సమంచిత మద్వయం పరమప్రకాశ మగోచరం
భేద వర్జిత మప్రమేయ మనంత మాద్యమ కల్మషమ్
నిర్మలం నిగమాంత మద్వయ మప్రతర్క్య మబోధకమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

2. నాద బిందు కళాత్మకం దశనాద భేద వినోదకం
మంత్రరాజ విరాజితం నిజ మండలాంతర్భాసితమ్
పంచవర్ణ మఖండమద్భుత మాదికారణ మచ్యుతమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

3. వ్యోమవత్ బహిరంతర స్థిత మక్షరమ్ అఖిలాత్మకం
కేవలం నిజశుద్ధమేక మ జన్మహి ప్రతిరూపకమ్
బ్రహ్మతత్త్వ వినిశ్చయం నిరతానుమోద సుబోధకమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

4. బుద్ధిరూప మబుద్ధికం త్రితయైకకూట నివాసినం
నిశ్చలం నిరత ప్రకాశక నిర్మలం నిజమూలకమ్
పశ్చిమాంతర ఖేలనం నిజశుద్ధ సంయమి గోచరమ్
ప్రాతరేవహి మానసాతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

5. హృద్గతం విమలం మనోజ్ఞ విభాసితం పరమాణుకం
నీలమధ్య సునీల సన్నిభ నాదబిందు నిజాంకుశమ్
సూక్ష్మ కర్ణిక మధ్యమ స్థిత విద్యుదాది విభాసితమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

6. పంచ పంచ హృషీకదేహ మనశ్చతుష్క పరస్పరం
పంచ భూత సకాయషట్క సమీరశబ్ద ముఖేతరమ్
పంచకోశ గుణత్రయాది సమస్తధర్మ విలక్షణమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

7. పంచ ముద్ర సులక్ష్యదర్శన భావమాత్మ నిరూపణం
విద్యుదాది ధగద్ధగిత్వ సుచిర్వినోద వివర్ధనమ్
చిన్మఖాంతర వర్తనం విలసద్విలాస మమాయికమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

8. పంచవర్ణ శుచిర్విచిత్ర విశుద్ధతత్త్వ విచారిణం
చంద్ర సూర్య చిదగ్ని మండల మండితం ఘనచిన్మయమ్
చిత్కళా పరిపూర్ణ మంతర చిత్సమాధి నిరీక్షణమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

9. హంసచార మఖండనాద మనేకవర్ణ మరూపకం
శబ్దజాలమయం చరాచర జంతుదేహ నివాసినమ్
చక్రరాజ మనాహతోద్భవమేక వర్ణ మతాపకమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

10. జన్మకర్మ విలీనకారణ హేతుభూత మబోధకం
జన్మకర్మ నివారకం రుచిపూరకం భవతారకమ్
నామరూప వివర్జితం నిజనాయకం సుఖదాయకమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

11. తప్తకాంచన దీప్యమాన మహాణు మాతృక రూపకం
చంద్రకాంతక తారకైరవముజ్వలం పరమాస్పదమ్
నీలనీరద మధ్యమస్థిత విద్యుదాది విభాసితమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

12. స్థూలసూక్ష్మస కారణాంతర ఖేలనం పరిపాలనమ్
విశ్వతైజసప్రాజ్ఞ చేత సమంతరం నిఖిలాంతరమ్
సర్వకారణ మీశ్వరం నిటలాంతరాళ విహారకమ్
ప్రాతరేవహి మానసాంతర్భావయే ద్గురుపాదుకామ్ ॥

# శ్రీ గురుపాదుకాస్తవము-వివరణము

# 1వ శ్లోకము

## 1. శ్రీ సమంచిత :

శ్రీ అనగా లక్ష్మి అని, సరస్వతి అని, పార్వతి అని, మాయ అని అర్థములు కలవు. లక్ష్మి అనగా సంపద, శోభ, శుభము, వైభవము, అందము మొదలగు గుణములుకల దేవత. సరస్వతి విద్యాదేవత. సకల విద్యలకు మూలమగు శక్తి. పార్వతి అనగా ధైర్యము, స్థైర్యము, సంకల్పబలము, వీర్యము ఇత్యాది శక్తులు కల దేవత. ఈ మూడు దేవతలును ఒకే శక్తికి సంబంధించిన దేవతలు. మూడు శక్తులను కలిపి కూడ 'శ్రీ' అని పిలుతురు. ఈ మూడు శక్తులే సృష్టి స్థితి లయములకు కారణము.

పై మూడు శక్తులు ఎవరిని ఆశ్రయించి యుండునో, ఎవరిని పరిపూర్ణముగ అనుగ్రహించునో అట్టివానిని 'శ్రీ సమంచితుడు' అని పిలుతురు. సద్గురు వట్టివాడు. అతని యందు త్రిశక్తులును యుక్తమై యుండును. అతనిని స్నేహపూర్వకముగ ఆశ్రయించి యుండి, అతని అనుయాయులను అనుగ్రహించుచు ఈ దేవత లుందురు. అట్టి సద్గురువు పాదుకలను హృదయమున, ఉదయము ననే నేను భావింతును.

## 2. అద్వయం :

రెండు కానిది అని అర్థము. ఉన్నది ఒకటే. దాని నుండి

ఏర్పడిన సంకల్పము నుండి అనేకానేక సంకల్పములు ఏర్పడి రూపములను గొనుచున్నది. బంగారము ఒకటే అయినను, ఆభరణములు కోకొల్లలు. అన్నమొకటే అయినను, ఆహారములు అనేకములు. అట్లే సృష్టి యందున్నది ఒకే దైవము. అతని నుండి పుట్టిన ప్రకృతి నుండి మూడు గుణము లుద్భవించి, మూడు పేటల జడగ, ఏడు లోకముల సృష్టి, అందలి జీవులు ఏర్పడినారు. అనగా దైవమే బహు విధములుగ రూపాంతరములు చెందినాడు.

ఒకే సూర్యకిరణము నుండి ఏడు రంగులు పుట్టినట్లు, ఒకే స్వరము నుండి ఏడు స్వరములు పుట్టినట్లు, ఒకే శబ్దము నుండి అనేక శబ్దములు పుట్టినట్లు, ఒకే తత్త్వము నుండి కోటానుకోట్ల వస్తువులు పుట్టినవి. పిండి రొట్టెగ రూపాంతరము చెందినను, దాని మూలము పిండియే కదా! అనేకానేకములగు వస్త్రములు గోచరించినను, వాని మూలము పత్తియే కదా! ఇట్లన్ని రూపముల యందలి మూలము ఒక్కటియే. అది ఎప్పుడునూ వున్నది. రెండుగ గోచరించినను, అది ఒకటియే. (అద్దమున, నీకు నీవు గోచరించినను, నీవు రెండు కానట్లే, తత్త్వము కూడ ఎప్పుడునూ ఒకటియే.) అదియే గురువు. అనగా అన్నిటికిని పెద్దది. దాని నుండి దిగివచ్చిన వన్నియూ లఘువులే. ఈ సత్యము తెలిసిన పుణ్య పురుషుని యందు అది మిక్కుటముగ భాసించుచు నుండును.

అట్టి పుణ్య పురుషుని పాదుకలను అంతర్ మనస్సు అయిన హృదయము నందు ఉదయముననే భావించెదను.

## 3. పరమప్రకాశమ్ :

ప్రకాశమునకు పరమైనది అని అర్థము. ప్రకాశించునది కనబడుచుండును. కాని దానిని ప్రకాశింపచేయునది కనపడదు కదా! అట్లే గురుతత్త్వము పరబ్రహ్మ తత్త్వము కూడ. విద్యుత్ దీపము గోచరించునే గాని, విద్యుత్తు గోచరింపదు. అట్లే గురుతత్త్వము దైవతత్త్వము ప్రకాశించినంతమేర తెలియును కాని మొత్తము తెలియదు. దానిని తెలుసుకొనుటకే మహర్షులు, బ్రహ్మర్షులు బహు విధములుగ ప్రయత్నించిరి. తెలుసుకొను ప్రయత్నమున, వారి తెలివి తత్త్వములో ఇమిడి పోవుటచే తెలియబడువాడు లేకపోయెను. తెలియుచుండనంత వరకు తెలుసుకొనువాడు, తెలుసుకొనబడునది, తెలియుట అని యుండును. కాని తెలుసుకొనువాడు, తెలియబడు దానిలో లయమైనపుడు తానుండుట యుండదు. కనుక తెలియబడు విషయము తెలివిని మించిన విషయమని తెలియును. అందువలన దానికి 'పరము' అని పేరిడిరి. అనగా తెలివి కందక యుండునది అని అర్థము. తెలివికి పుట్టుక స్థానమని అర్థము. అదియే గురు తత్త్వము, దైవతత్త్వము. తెలిసినంత తెలియుటయేగాని అంతయూ తెలియుట యుండదు.

అట్టి గురుతత్త్వమునకు ప్రతీకలైన గురుపాదుకలకు అంతర్

మనస్సు అగు హృదయమున ప్రాతః కాలముననే నమస్కరించుదును.

## 4. అగోచరమ్ :

గోచరము కానిది. అనగా కనిపించనిది. కనులకుగాని, మనస్సునకుగాని గోచరము కానిది; బుద్ధికి అంతంత మాత్రముగ గోచరించునది. అవ్యక్తమగు గురుతత్త్వము ఆకాశము వంటిది. ఆకాశములోతు ఎవరికిని తెలియదు. గురుతత్త్వమనగా పరతత్త్వమే. త్రిమూర్తులు సైతము దీనిని తెలియలేరు. అందువలననే గురుదీక్ష వహించిన వారికి త్రిమూర్తులకన్న కూడ గురువే ముఖ్యము.

## 5. భేద వర్జితమ్ :

తరతమ భేదములు విసర్జించినవాడు. గురుతత్త్వమునకు తనవారు, ఇతరులు అను భేదముండదు. సద్గురువు ప్రేమ స్వరూపుడు. అతడి కందరును తనవారే. తనవారు కాని వారుండరు. శ్రద్ధను బట్టి కోరినవారికి కోరిన దెల్ల ఇచ్చును. కోరినవారి మంచి చెడులతో అతనికి సంబంధము లేదు. పురాణములందు పరమ శివుడు ఈ విధముగ దేవతలకు, దానవులకు, మానవులకు, అందరికిని వారి వారి శ్రద్ధా భక్తులను బట్టి వరము లిచ్చు వాడుగ గోచరించును. గురువు దృష్టియందు అందరునూ సమానులే. దుష్టశిక్షణము, శిష్టరక్షణము ప్రభువు కర్తవ్యమే కాని గురువు కర్తవ్యము కాదు. కోరిన విద్యలను అందించుట సద్గురువు లక్షణము.

దానికి వలసిన అర్హతల నేర్పరచుట, శిక్షణల నిచ్చుట యిత్యాదివి చేయునేగాని, భేదభావము కలిగి యుండడు. సదురువు నుండి పొందిన విద్యలను సద్వినియోగము చేసినవారు కలరు. దుర్విని యోగము చేసినవారును కలరు. వినియోగ బాధ్యత విద్యార్థిదే గాని, సద్గురువుది కాదు. కావున సద్గురువును అందరునూ ఆశ్రయించవచ్చును. ప్రభువును లోక కంటకు లాశ్రయించలేరు. మన పురాణములందు దుష్టశిక్షణ, శిష్టరక్షణచేయు ప్రభుతత్త్వమును శ్రీమహావిష్ణువుగను, భేద భావములేని గురుతత్త్వమును పరమ శివునిగను వర్ణించిన ట్లగుపించును. అపుడపుడు వారిరు తత్త్వము లను నిర్వర్తించినట్లుగ గోచరించును.

అట్టి అభేద తత్త్వ రూపమగు గురుమూర్తి పాద పద్మములను ప్రాతః కాలమున నా హృదయ పీఠమున భావించెదను.

## 6. అప్రమేయమ్ :

కొలతల కందనివాడు. సద్గురు విట్టివాడు, అట్టివాడు, ఇంతటివాడు, అంతటివాడు అని పలుకు వారందరును తెలియని వారే! "తెలిసినకొలది, తెలియదని తెలియుట నిజమగు తెలివి." తెలిసీ తెలియనివారే సద్గురువును గూర్చిన కొలతలు వేయు చుందురు. ఎవరి దృక్పథము నుండి ఎట్లు చూచిన అట్లగుపడు వాడు గురువు. అతనిని గూర్చి ఇంతటివాడు అని తెలుపుట అసాధ్యము. సద్గురువును స్తుతించవచ్చునే గాని, నిర్వచింపరాదు.

స్తుతించుట వలన అతని సాన్నిధ్యము లభించును. స్తుతించువాడు ఆనందమయ కోశమున సుఖించును. నిర్వచించువాడు మనోమయ కోశమున చిక్కుకొనును. సూత మహర్షిని శౌనకాదులు శ్రీకృష్ణుని గురించి వివరింపుమనిరి. వివరించుట అసాధ్యమని, అందినంత వర్ణింతునని సూత మహర్షి వినయముగ పలికెను. సద్గురువును వర్ణించువారు, స్తుతించువారు వాని అనుగ్రహ పాత్రులగుదురు. వచించువారు, నిర్వచించువారు తదనుగ్రహమును పొందలేరు.

అట్టి సద్గురుమూర్తి పాదుకలను ప్రాతఃకాలమునే నా హృదయమున స్మరించెదను.

## 7. అనంతమ్ :

అంతము లేనివాడు. సృష్టి యందు పుట్టిన దెల్ల గిట్టుట తప్పదు. మొదలైన దెల్ల అంతమగుట తప్పదు. పరతత్త్వమగు గురుతత్త్వము సృష్టికి ముందు, సృష్టి యందు, సృష్టికి తరువాత కూడ యుండును. ఆ తత్త్వమునకు ఆది లేదు, అంతము లేదు; పుట్టుక లేదు, చావు లేదు. పెరుగుదల లేదు, తరుగుదల లేదు. చోటులో అన్నియు పుట్టి మరల చోటులోనికే అన్నియూ చేరును. చోటు ఎప్పుడునూ యుండును. చోటుకు ఎల్లలు లేవు. తీరము లేదు. వారము లేదు. సద్గురు తత్త్వము కూడ చోటువలెనే యుండును. ఒక వ్యక్తివలె గోచరించిననూ అందుండి వ్యక్తమగు నది గుణాతీతమగు తత్త్వమే. తానొకడుగ నున్నానను భావము

సద్గురువున కుండదు. అందరి యందుండుటగ యుండును. అతడు ఉండుట వలననే అంతయూ పెరుగుట, తరుగుట, మారుటగ ప్రకృతి మహత్తరమగు విన్యాసములు జరుపుచున్నది. మూల మతడే. బీజ మతడే. "బీజం మాం విద్ధి పార్థా ।" "ఓ అర్జునా! నేనే మూలము అని తెలియుము" అని భగవంతుడగు శ్రీకృష్ణుడు పలికినాడు. అట్టి అనంతమగు తత్త్వమునకు నమస్కరించుట ఒక్కటియే ప్రధానము. తెలిసికొనుట అను ప్రయత్నము, దానితో ముడిపడి యుండుటయే అని తెలియవలెను.

## 8. ఆద్యమ్ :

మొదలునకు మొదలైనది. ఏదైన మొదలగుటకు దానికొక మొదలుండును. మొదలగుట అనగా సంకల్పము. సంకల్పము పుట్టుటకు కాలము ప్రేరణ యిచ్చును. కాలము ప్రేరణ నిచ్చుటకు మరియొక అవ్యక్తమగు తత్త్వము కారణమై యున్నది. అతడు కారణమునకు, ప్రేరణమునకు కూడ మూలమైనవాడు. ఆ తత్త్వమే లేనిచో కాలము లేదు. ప్రేరణ లేదు. సంకల్పము లేదు. శక్తి లేదు. ప్రకృతి లేదు. పురాణముల యందు "నిద్రవంటి స్థితియందున్న తత్త్వము" అని తెలిపిరి. అది నిద్ర కాదు. మెలకువ కాదు. గురుతత్త్వ మట్టిది. నిజమునకు పరతత్త్వమే గురుతత్త్వము.

మనము కూడ నిద్రనుండి మెలకువ వచ్చులోపల ఈ స్థితి యందే ఉందుము. దీనిని అనుభూతి చెందినవారు నిద్ర,

మెలకువలను దాటిన వారగుదురు. అందులకే ప్రాతఃకాల ప్రార్థనలు. సద్గురు తత్త్వము తన అనుయాయులకు నిత్యము ప్రసరింపచేయు స్థితి యిదియే. దీనిని పొందుటకే శ్రద్ధాళువగు శిష్యుడు ప్రయత్నింప వలెను కాని చిల్లర విషయముల కొరకు కాదు. ఈ అనుభూతియే అన్ని స్థితులనుండి జీవులను దాటించును. ఈ అనుభూతియే సృష్టి యందలి మాయను దాటింప చేయును. దీనినే 'వజ్రచైతన్య' మని పరమగురువు మరువు మహర్షి పలుమార్లు వివరించినారు.

అట్టి వజ్రచైతన్య స్వరూపుడగు సద్గురువు పాదుకలను ప్రాతః కాలమున హృదయ పద్మమందు భావించెదను.

## 9. అకల్మషమ్ :

కల్మషము లేనివాడు. మలినములు లేనివాడు. అగ్నివలె మలినములచే తాకబడనివాడు. పవనునివలె మలినము లంటని వాడు. సద్గురు వెల్లప్పుడును నిజస్థితియందే యుండుటచే అతని నేమియు అంటవు. అన్నిట నిండియున్నను ఏమియు అంటక యుండును. గృహముల యందు చోటువలె అనేకానేక రూపముల యందుండును. కాని ఏమియు అంటవు. అన్నిట అతని ప్రభావ ముండుటచే అన్నియూ వున్నట్లు గోచరించును. ఆ ప్రభావమే లేనప్పుడు ఏమియూ యుండవు. అన్నిటా తన ప్రభావము నిండి యుండి ప్రమేయము లేనివాడుగ గురుతత్త్వమున్నది.

ఉదాహరణకు దీపపు కాంతి నిండిన చోటులో ఎందరో ఎన్నియో కార్యములు చేయుచుందురు. మంచి, చెడు పనులు కూడ ఆ కాంతిలోనే జరుగుచుండును. కాని వివిధములగు కార్యములు జరుగుటకు దీపపు కాంతి కారణము కాదు కదా! కాంతిలో జీవులు వారి వారి స్వభావములను బట్టి పనిచేయు చున్నారు. కాంతి వీటన్నిటికిని ఆధారమే కాని, కారణము కాదు. కారణము కాదు కనుక కార్యముల కల్మషములు అతని నంటవు.

మరియొక ఉదాహరణ : తమలోని చైతన్య మాధారముగ జీవులు వారి వారి స్వభావములను ప్రకటించుకొనుచు క్రిందు మీదు లగుచుందురు. అనుభవము చెందుచు పరిణామము చెందు చుందురు. ఈ మొత్తమునకు దివ్య సాన్నిధ్యమే ఆధారము. సద్గురు సాన్నిధ్యము అటువంటిది.

## 11. నిగమాంతమ్ :

ఉపనిషత్ సారమని అర్థము. ఉపనిషత్తులు దైవతత్త్వమును అనుభూతి చెందుటకు వలసిన మార్గములను చూపు గ్రంథములు. ఉపనిషత్తులు దైవమును ఒక తత్త్వముగను, చైతన్యముగను, ఆనంద స్వరూపముగను తెలుపును. మన ముండుట అనునది సత్యము. ఉండుట వలన అందుండి మేల్కాంచుట, ఎఱుకను పొందుట, ఎఱుక ఆధారముగ ఆనందానుభూతి పొందుట అను ఆ మూడు స్థితులను- సత్, చిత్, ఆనంద మనిరి. దానిని పొందు మార్గము

లను, వేలాది సంవత్సరములు తపస్సు చేసి, ఋషులు మానవున కందించిరి. సద్గురువనుగ్రహము వలన ఈ మార్గములు తెలియ నగును. పరతత్త్వమునకు ప్రతీకగ నిలచిన గురుతత్త్వము అన్వేషకు లకు అందుబాటులో నుండును. ఉపనిషత్ సారమైన పరతత్త్వమే గురుతత్త్వముగ సంఘమున అవతరించి యుండును. అందువలన సద్గురువు ఉపనిషత్ సారాంశముగ ఈ నామమున కొనియాడ బడినాడు.

## 12. అద్వయమ్ :

సృష్టి ద్వంద్వములతో కూడి యుండును. ద్వంద్వములు పరస్పర విరుద్ధములు. పరస్పర విరుద్ధములగు స్వభావములు ఒకే కేంద్రమునుండి వెలువడును. దేవతలకు, దానవులకు తండ్రి యొకడే. అతడే కశ్యప ప్రజాపతి. అతని నుండి అదితిద్వారా ఆదిత్యులు పుట్టిరి. దితిద్వారా దైత్యులు పుట్టిరి. వినతద్వారా గరుత్మంతుడు ఆదిగాగల పక్షులు పుట్టినవి. కద్రువ ద్వారా సర్పములు పుట్టినవి. వీనిని కుడి ఎడమల ప్రజ్ఞలుగ తెలియవలెను. మనలో కూడ కుడి ఎడమలుగ పింగళ, ఇడ నాడులు వున్నవి. కుడి అనగా ప్రజ్ఞామయము. ఎడమ అనగా పదార్థమయము. రెండునూ జీవుల కవసరమే. రెండునూ సమపాళ్ళుగ నున్నప్పుడు అర్ధనారీశ్వర తత్త్వ మందురు. దానినే యోగ మందురు. రెంటినీ సమపాళ్ళుగ తన యందిముడ్చు కొన్నవాడు యోగి.

సృష్టియందు అంతయూ ద్వంద్వమే. అన్నిటి యందలి ద్వంద్వమును సమబుద్ధితో సమన్వయించుకొని, ద్వంద్వాతీతముగ నిలిచి అందరికిని ఉద్ధారణము కలిగించువాడు సద్గురువు. అతడు చెడును దూషింపక మంచిని పెంచు మార్గమును ప్రదర్శించు చుండును. అతడు అద్వయుడు.

## 13. అప్రతర్క్యమ్ :

తర్కమున కతీతుడు అని అర్థము. గురుతత్త్వమనగా పరతత్త్వమే కదా! పరతత్త్వమున నంతయూ యిమిడి యుండును. తత్త్వమే యుండును గాని తర్కించుటకు మరియొక డుండడు. తర్కించువాడు, తర్కము కూడా తత్త్వమున యిమిడి యుండును. అందువలన పరతత్త్వము తర్కమునకు లొంగునది కాదు. అదే విధముగ గురుతత్త్వము కూడ తర్కమున కతీతము. గురువును గూర్చి తర్కించుట శిష్యునకు సముచితము కాదు. తర్కము మనోమయ లోకమునకు, బుద్ధిమయ లోకమునకు పరిమితము. గురుతత్త్వము, పరతత్త్వము ఆనందమయ లోకమునకు, అనుపాదక, ఆదిలోకములకు సంబంధించిన వగుట వలన తత్త్వమున కతీతమై యుండును.

## 14. అబోధకమ్ :

తెలియ శక్యము కానిది. సృష్టియందు, మానవుని యందు స్థూలముగ ఏడులోకముల గూర్చి చెప్పవచ్చును. అవి వరుసగ

భౌతికము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము, ఆనందమయము, అనుపాదకము, ఆదిలోకములుగ తెలియవచ్చును. ఇందు బుద్ధిమయలోకము వరకే తెలియుట యుండును. ఆనంద మయ లోకమున తన్మయము చెందుచుండగ కూడ కొంత తెలియ వచ్చును. అటుపైన తానున్నానను స్పృహ మాత్రమే యుండును. ఆ పైన ఉండుటయే గాని, స్పృహ యుండదు. దీనిని 'సమాధి స్థితి' యందురు. గురుతత్త్వము, పరతత్త్వము ప్రధానముగ ఈ లోకముననే యుండును. ఆవశ్యకతను బట్టి దిగువ లోకములలోనికి ప్రవేశించుచుండును. అందువలన పరతత్త్వము, గురుతత్త్వము పరిపూర్ణముగ తెలియు అవకాశము లేదు.

# 2వ శ్లోకము

## 15. నాదబిందు కళాత్మకమ్ (2-1) :

నాదము, బిందువు, కళల రూపమున గోచరించునట్టివాడు. సదాచారుడు అయిన శిష్యుడు అంతర్ముఖుడై ధ్యానించునపుడు అంత రంగమున సద్గురువే అనేకానేక కళలుగ గోచరించును. రకరకముల వర్ణములుగను, రూపములుగను, ఎన్నెన్నో కళలుగను గోచరించును. తరచు పసుపు, ఎఱుపు, సిందూరము, వెన్నెల కాంతి, సూర్యకాంతి, తారకల కాంతిగ దర్శనములు జరుగుచుండును. దివ్య మగు కాంతు లన్నియు గోచరించు చుండును. దివ్యమగు ఆశ్రమములు, క్షేత్రములు కూడ గోచరించు చుండును. అనేకములగు దేవతా రూపములు, మహాత్ముల రూపములు, సంస్కార వశమున గోచరించు చుండును. కాంతి రూపములు అనేకములు అంతరంగమున గోచరించుట కూడ పరతత్త్వము, గురుతత్త్వమే కారణము.

అదేవిధముగ అనేకానేక నాదములుకూడ వినిపించు చుండును. కాలిగజ్జల సవ్వడి, గాజుల సవ్వడి, ఆభరణముల సవ్వడి అనేక సంగీత వాయిద్యముల సవ్వడికూడ వినిపించు చుండును. శంఖ నాదము, వేణునాదము, డమరుకముల శబ్దములు, భేరీ నాదములు కూడ వినిపించు చుండును. ఓంకార నాదము కూడ వినిపించు చుండును.

శబ్దము, వెలుగు ఆధారముగనే పంచభూతములతో కూడిన సృష్టి ఏర్పడుచున్నది. సాధకుడు దేహాత్మ భావననుండి బుద్ధిమయ లోకము ప్రవేశము గావించునపుడు పై విధములగు వెలుగులు కనిపించుట, శబ్దములు వినిపించుట జరుగును. అంతరంగ సాధన యనగా బుద్ధిమయలోకము ప్రవేశించి దైవము నారాధించుట; అనగా హృదయమును చేరి ఆరాధించుట. ఇట్లు ఆరాధన గావించినపుడు కళలు, నాదము గోచరించుట, అనుభవించుట చాలకాలము జరిగిన పిమ్మట వానికి మూలమైన బిందుస్థానము గోచరించును. ఆ బిందువు రూపమున సద్గురువు పరతత్త్వమునకు ముఖద్వారమై యుండును. ఇట్లు సద్గురువు కళాస్వరూపుడుగను, నాదస్వరూపుడుగను, బిందు స్వరూపుడుగను మార్గదర్శియై పరతత్త్వమునకు దారి చూపును. అతడు నాదబిందు కళాత్మకుడు.

## 16. దశనాద భేద వినోదకమ్ (2-2) :

పదివిధములైన నాదములతో వినోదించువాడు, వినోదము కల్పించువాడు. సృష్టి మొత్తము పది అంకెలుగ ఏర్పడినదని, పది శబ్దములుగ ఏర్పడినదని, పదిమంది ప్రజాపతుల ఆధారముగ ఏర్పడినదని వేదము తెలుపుచున్నది. మూడు గుణములు, ఏడు లోకములు కలిపి పది స్థితులుగ తెలుపుదురు. బ్రహ్మలోకము, కైలాసము, వైకుంఠము, ఈ మూడులోకములాధారముగ సత్యలోకము, తపోలోకము, జనలోకము, మహర్లోకము, సువర్లోకము, భువర్లోకము,

భూలోకము ఏర్పడినవి. త్రిమూర్తుల ప్రజ్ఞలు, ఏడులోకములు కలిసి మొత్తము గురువును, దైవమును దశాత్మకముగ తెలుపుదురు. అతనినే 'దత్తాత్రేయు' డని కూడ అందురు.

దశనాదములుగ ఓంకారము, భేరీనాదము, డమరుకము, వేణునాదము, శంఖనాదము, వీణానాదము, ఘంటారావము, మృదంగనాదము, గజ్జెల సవ్వడి, గాజుల సవ్వడిగ తెలుపుదురు. ఈ నాదముల అంతరంగ అనుభూతి గురుదర్శనమే అని తెలియవలెను.

## 17. మంత్రరాజ విరాజితమ్ (2-3) :

మంత్రరాజముగ విరాజిల్లువాడు. సద్గురు విచ్చిన మంత్రము రాజమంత్రము వంటిది. శ్రద్ధాభక్తులు గల శిష్యులకు ఆ మంత్రమే తారకమై నిలచును. సద్గురు విచ్చిన మంత్రము మహామంత్రము. అది మహావాక్యము కూడ. పరిపూర్ణ భక్తి విశ్వాసములతో ఈ మంత్రము ననుష్ఠానము చేయవలెను. సద్గురువు నాశ్రయించిన వారికి ఈ మంత్రముకన్న మించినది లేదు. ప్రతి సద్గురువు తన అనుయాయులకు దారిచూపుటకు, ఆ దారిలో నడిపించుటకు నొక మంత్రోపదేశము చేయును. ఆ మంత్రము ననుసరించుటకన్న శ్రేష్ఠ మగు సాధన మరియొకటి లేదు. మంత్రరూపమే గురురూపము. ఆ మంత్రోచ్చారణే గురుసాన్నిధ్యమునకు తాళపుచెవి. మంత్రమే గురువు. గురువే మంత్రము. గురుశిష్య సంప్రదాయమున గురు విచ్చిన మహామంత్రమే వారధి. గురువును చేరుటకును, దైవమును చేరుటకును మంత్రమే వంతెనయై నిలచును.

## 18. నిజ మండలాంతర్భాసితమ్ (2-4) :

హృదయ మండల మందు భాసించువాడు. నామము, రూపములతో కూడిన ప్రపంచమునకు వెలుగే ఆధారము. ఆ వెలుగును అంతర్ముఖముగ సూక్ష్మలోకమున దర్శించ వచ్చును. సద్గురువు కూడ రక్తమాంసాదులతో కూడిన శరీరమున గోచరించు చున్నప్పటికి సత్సాధకులకు అంతరంగమున తేజోమూర్తిగ గోచరించును. సద్గురువు వెలుగు సాధకుని సంస్కారములను బట్టి గోచరించునే గాని మరియొక విధముగ గోచరించదు. బహిరంగమున ఇతరులవలెనే గోచరించు సద్గురువు అంతరంగమున తేజోమూర్తివలె భాసించును. అతడు నివురుగప్పిన నిప్పు వంటివాడు.

## 19. పంచవర్ణమ్ (2-5) :

ఐదురంగులు గలవాడని యొక అర్థము. వర్ణమనగా అక్షరమని కూడ అర్థమున్నది. అక్షరము శబ్దమునకు రూపము. కావున ఐదు శబ్దములతో కూడినవాడని కూడ అర్థము. ఐదు రంగులు అనగా వజ్రపు వెలుగు, ముత్యపు వెలుగు, ఎఱుపు, పసుపు, నీలము. ఇందు మొదటి రెండు రంగులు సూర్యచంద్రాత్మకములగు వెలుగులు. మిగిలినవి మూడు త్రిమూర్తుల రంగులు. అనగా బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల రంగులు. ఈ ఐదింటిని కలిపి పంచవర్ణుడని, పంచ ముఖుడని దైవమును, గురువును వర్ణింతురు. పంచముఖములతో కూడిన గాయత్రి, శివుడు, ఆంజనేయుడు ఈ ఐదుముఖములకు ప్రతీకలు.

పంచముఖము, పంచవర్ణము అయిన దైవమును పంచాక్షరితో కొలుచుట సంప్రదాయము. ఇదియే పంచాక్షరీ మంత్రము. అక్షరములలో అచ్చులు ప్రాణములు. అందు ఐదు అచ్చులు మిగిలిన అచ్చులకు ఆధారములై యున్నవి. అవి అ, ఇ, ఉ, ఋ, ఌ.

సృష్టి యంతయూ ఐదు శబ్దములతో నిర్మితమైనదని శాస్త్రమున "ఈ మొత్తమంతయూ పాంక్తమే" అని వేదవ్యాస మహర్షి పలికినాడు. (పాంక్తంవా ఇదగ్ం సర్వమ్). పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచేంద్రియములు, పంచప్రాణములు. ఇవి అన్నియూ పంచ వర్ణముల నుండి ఏర్పడినవే. సర్వమూ తానై యున్న సద్గురువు పంచవర్ణ స్వరూపుడు.

## 20. అఖండమ్ (2-6) :

ఖండము కానివాడు. ఖండములు ఖండములుగ గోచరించు చున్నను, నిజమునకు పరతత్త్వము, గురుతత్త్వము అఖండమే. మన యందు వివిధములగు అంగము లున్నప్పటికిని ప్రతి ఒక్కరును తమను తాము ఒక్కరిగనే భావింతురు కదా! నిజమునకు మన యందంగము లెన్నియో కలవు. అన్నిటిని కలిపి 'నేను' అను చుందుము. అట్లే దైవము కూడ. భూమి యందెన్ని జీవరాసు లున్ననూ, అన్నింటినీ భూమియే పట్టి యుంచినది. అట్లే భూమి, ఇతరగోళము లన్నింటినీ సూర్యుడు పట్టి యుంచినాడు. అట్లే సూర్య మండలముల నన్నింటినీ సవితృమూర్తి పట్టి యుంచినాడు. అట్లే

సమస్త బ్రహ్మాండమునూ ఒకే చైతన్యము పట్టి యుంచినది. ఆ చైతన్యము సత్యమాధారముగ వెలుగుచున్నది. ఈ సత్య మఖండము. దాని చైతన్య మఖండము. వాని యందు తేలియాడు సమస్త రూపములు వాని యధీనముననే యున్నవి. అలలెన్ని యున్ననూ, సముద్రమొక్కటే. తరంగములెన్ని యున్ననూ, నది యొక్కటే. శబ్దము లెన్ని యున్ననూ నాద మొక్కటే. రంగులెన్ని యున్ననూ వెలుగొక్కటే. ప్రాణులెందరు న్ననూ ప్రాణ మొక్కటే. జీవాత్మలెన్ని యున్ననూ పరమాత్మ యొక్కడే. ఒక్కటే యిన్నిగా భాసించుచున్నది.

## 21. అద్భుతమ్ (2-7) :

ఆశ్చర్యకరమైనవాడు. సద్గురు వెప్పుడునూ ఆశ్చర్యకరుడే. అతడి చేష్టలు ఊహించుట కష్టము. అతడే సిద్ధాంతములకు గాని, విధానమునకు గాని స్వభావమునకు గాని చిక్కనివాడు. అతడి ప్రవర్తన అనూహ్యముగ నుండును. అతడెప్పుడునూ ఆనందస్వరూపుడే అని భావింపరాదు. అతడు కోపమును, ప్రేమను, మౌనమును, భాషణమును, హాసమును ఎపుడు చేయునో తెలియుట కష్టము. కాలమును, దేశమును, సన్నివేశమును, జీవుల ప్రవర్తనమును బట్టి, అతని ప్రవర్తన ముండును. అవసరమగుచో నిష్కారణమగు చేష్టలు కూడ ప్రకటించుచుండును. అతడు వాసనాబద్ధుడు కాదు గనుక నిర్దిష్టమగు ప్రవర్తన కూడ అతనియందు గోచరింపదు. అతడు నిత్య నూతనుడు. ఆశ్చర్యకరుడు కూడ. అతడు చేయు పనులు కూడ

అద్భుతముగ నుండును. అతడేమి చేసిననూ తనవారి నుద్ధరించుటకే అని తెలియవలెను.

## 22. ఆదికారణమ్ (2-8) :

అన్నిటికీ మూలమైనవాడు. ఆదికి మూలమైనవాడు. మొదలునకే మొదలు. మొదటి సంకల్పమునకు కూడా ముందు నుండీ యుండువాడు. సంకల్ప మతని ప్రకృతి. మొదటి ప్రేరణ కతడే ఆధారము.

పరతత్త్వము నుండి కాలము రూపమున ప్రేరణ కలుగును. ప్రేరణ కారణముగ శక్తి, ప్రకృతి ఏర్పడి అందుండి త్రిగుణములు, త్రిగుణముల నుండి ఏడులోకములు ఏర్పడుచుండును. ఈ మొత్తము నకు కారణము ప్రేరణయే. ప్రేరణకు కారణము కాలము. అట్టి కాలమునకు, ప్రేరణకు ఆధారమైనది పరతత్త్వము. దానిని గురువుగ భావించుట సూచింపబడినది.

ఉదాహరణకు మనమూరక కూర్చున్ననూ కాలమును, ప్రకృతిని అనుసరించి ప్రేరణ కలుగును. ఊరుకున్నను ప్రేరణ కలుగుటకు కారణము "నేను" అను ప్రజ్ఞ. 'నేను' లేనిచో ప్రేరణయే లేదు. ప్రేరణ ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులుగ ఏర్పడుచు నుండును. అట్లే సృష్టియందే 'నేను' అను ప్రజ్ఞ ఆధారముగ సర్వమునూ ఏర్పడుచున్నవి. అందువలన అతడు మూలకారణమని ఆరాధింపబడు చున్నాడు. 'నేను' లేనిది ఏమియులేదు. కారణమే లేదు. కార్యమే

లేదు. సృష్టిలేదు. "నేను ఆధారముగ నా ప్రకృతి గుణముల నల్లిక చేసి గుణములతో సృష్టిని చేయుచున్నది" అని శ్రీకృష్ణుడు పలికినాడు. కారణము ప్రకృతియే. దానికి మూలము "నేను" అను ప్రజ్ఞ.

## 23. అచ్యుతమ్ (2-9) :

చ్యుతి అనగా జారుట. అచ్యుతుడనగా జారుట లేనివాడు. జారుట, పతనము చెందుట మొదలగునవి చైతన్యస్థితులే గాని తత్త్వమున కవిలేవు. తత్త్వమనగా సత్యము. సత్యమనగా "నేనున్నాను" అను స్థితి. ఉండుట శాశ్వతము. ఉన్నతిలో నుండుట, పతనములో వుండుట, ఆరోగ్యముగ నుండుట, అనారోగ్యముగ నుండుట, సుఖముగ వుండుట, దుఃఖముగ నుండుట, ఇట్లెన్ని విధములుగ నున్ననూ అందు వుండుట అనునది ఒక్కటే. దాని విశేషములే ఉన్నతి, పతనము, ఆరోగ్యము-అనారోగ్యము, సుఖము-దుఃఖము. అట్లే వివిధలోకముల యందుండుటలో కూడ. స్వర్గమందైననూ, నరక మందైననూ వుండుట తప్పదు. బ్రహ్మగ అయిననూ, దోమగ, చీమగ అయిననూ వుండుట ఒక్కటే. బ్రహ్మదేవుడూ వున్నాడు. చీమ ఉన్నది. ఇట్లన్నిట, అంతట యున్నది పతనము చెందదు. పతనము చైతన్య స్థితులకే గాని సత్యమునకు కాదు. రాయి రప్ప కూడ వున్నవి. వాటి చైతన్య స్థితి నిద్ర వంటిది. వృక్షములు వున్నవి. వాటి చైతన్య స్థితి స్వప్నము వంటిది. పశువుల యందు చైతన్య స్థితి ప్రాథమికమగు మెలకువ వంటిది. మానవుల యందు ఎఱుక పూర్తిగ మేల్కాంచి

నటువంటిది. దేవతల యందు, అంతరిక్షదేవతల యందు, దివి దేవతల యందు, దిశ దేవతల యందు కల మెలకువ (చైతన్యము) మరింత గొప్పది. ఈ వ్యత్యాసము లన్నియునూ చైతన్య మందలి వ్యత్యాసములే కాని, సత్యమందుకావు. చిన్ని వెలుగు, పెద్ద వెలుగుల వలె గోచరించునవన్నియూ చిన్న విద్యుత్తులూ, పెద్ద విద్యుత్తులూ కావు కదా! అట్లే ఉపాధులను బట్టి ప్రకాశ ముండును. ప్రకాశమున వ్యత్యాసము లున్నవి కాని, దాని కాధారమైన సత్యము నందు వ్యత్యాసము లేదు. ఈ సత్యమును తెలియ చేయుటకే “అచ్యుత” పదము. దైవమును అచ్యుతుడని, స్థాణువని సంబోధింతురు. అతడు అన్నిటి యందు నిండి యున్నవాడు. ఉండుట అనునది అతని తత్త్వము. శివుడు అంతటా నిండి యున్నవాడని, కైలాసము నందు స్మశానము నందు కూడ నున్నవాడని తెలుపుటలో స్థితి భేదములు లేక వున్నవాడని ఋషులు వర్ణించినారు.

# 3వ శ్లోకము

## 24. వ్యోమవత్ బహిరంతర స్థితమ్ (3-1) :

ఆకాశమువలె లోపల, బయట యున్నవాడు. 'వ్యోమవత్' అనగా ఆకాశమువలె. 'బహిర్ అంతర్' అనగా బయట, లోపల. 'స్థితమ్' అనగా స్థిరముగా నున్నవాడు. పరతత్త్వము లోపల, బయట చోటు వలె యున్నది. ఒక ఇల్లు కట్టినపుడు, ఇంటికి లోపల, బయట, చోటు కనపడును. ఇల్లు కట్టక మునుపు చోటు వున్నది. కాని, లోపల, బయట అను వ్యత్యాసము లేదు. అట్లే సృష్టిలో రూపము లేర్పడినపుడు రూపములకు లోపల, బయట చోటుగ తత్త్వమేర్పడి యున్నది. సృష్టి లేనప్పుడు కూడ వున్నది తత్త్వమే. సృష్టియందు కూడ ప్రతిరూపము నందు లోపల యున్నది తత్త్వమే. ఇట్లు లోపల, బయట వుండి సృష్టి కాధారమై యుండి నిండియున్న తత్త్వమే అన్నిటికిని పెద్ద. అందులకే పరతత్త్వము గురుతత్త్వముగ కీర్తింపబడినది. గురు అను పదమునకు పెద్ద అని అర్థము కదా!

శంకరులు పరతత్త్వమునే గురుతత్త్వముగ కొనియాడిరి. గురుతత్త్వమున స్థిరపడిన వారిని సద్గురువు లందురు. ఈ పాదుకాస్తవమునందు పరతత్త్వమునే గురుతత్త్వముగ శంకరులు కొని యాడిరని పాఠకులిప్పటికే గ్రహించి యుందురు. గురురూపము గురుతత్త్వమునకు ప్రతీక. తత్త్వమును చేరుటయే సాధకుని ఆశయము.

గురురూపమునకే పరిమితమై తత్త్వము తెలియనివారు, గురురూపము లాధారముగ మతముల నేర్పరచుదురు. పరతత్త్వము తెలియ జేయుటకే గురుతత్త్వ మేర్పడినది. తత్త్వ దర్శనమే గురుదర్శనము, పరదర్శనము.

సద్గురు మార్గమున సాధనా పరముగ కృషి చేయువారు లోపల బయట కూడ తత్త్వమును దర్శించుటకు ప్రయత్నింపవలెను. దీనినే విష్ణు, వాసుదేవ, నారాయణ ఉపాసనలుగ భాగవతము కీర్తించుచున్నది.

## 25. అవ్యయమ్ (3-2) :

రూపము, రంగు, రుచి, వాసన, శబ్దము మొదలగు త్రిగుణాత్మక సృష్టికి, పంచభూతాత్మక సృష్టికి ఆధారమై యుండి వాని సంబంధిత విశేషములుగాని, గుణములుగాని లేనివాడు. అవ్యయు డనగా వ్యయము కానివాడు. తత్త్వమునకు పెరుగుదల లేదు, తరుగుదల లేదు. చోటు ఎల్లప్పుడునూ చోటే. అందు పుట్టినవాటికి హెచ్చుతగ్గు లున్నవి కాని, చోటునకు హెచ్చుతగ్గులు లేవు. పుట్టినవానికి గుణము లున్నవి. పంచభూత తన్మాత్ర లున్నవి. ఈ మొత్తమన్నియు ప్రకృతి గుణములే కాని తత్త్వగుణములు కావు. తత్త్వమునకు గుణమే లేదు.

## 26. అక్షరమ్ (3-3) :

క్షరము కానిది అని అర్థము. అక్షరమునుండి క్షరముగా కొని రాబడునది అని అర్థము.

పరతత్త్వమునకు క్షరత్వము లేదు. శాశ్వతముగ నుండునది తత్త్వము. ఈ తత్త్వమే పదునాలుగు లోకముల నిండి యున్నది. అన్నిలోకముల రూపములు ఈ తత్త్వమాధారముగనే యేర్పడుచున్నవి. అన్నిటినీ తత్త్వమే వ్యాపించి యుండుట చేత కేంద్రము నుండి పరిధి వరకు తత్త్వమే ఆధారముగ సర్వము వ్యాప్తిచెంది యున్నది. సర్వ భూతము లందు ఈశ్వరత్త్వము వహించి యున్నది. తత్త్వములేని రూప ముండదు. రూపములేని తత్త్వ ముండగలదు. నగరములు, పట్టణములు, గ్రామములు, భూగోళము లేనపుడు కూడా చోటుగ తత్త్వమున్నది. అవి యున్నప్పుడు వాటియందు కూడ నిండి యున్నది. క్షరముకాక అన్నిటా వ్యాపించియున్న తత్త్వమును అక్షర మందురు. అక్షరాభ్యాస మనగా ఈ క్షరముకాని తత్త్వమును తెలిసికొనుటకు ప్రారంభము చేయు క్రతువు.

## 27. అఖిలాత్మకమ్ (3-4) :

అన్నిటి యందు కేంద్రముగ యుండువాడు. అన్నిటికిని ఆధారమై యుండువాడు. అన్నిటికిని ఆత్మయై యున్నవాడు. అన్నిటా గుణములాధారముగ వస్తువులు (జీవులు) వుండగ, అట్టి గుణముల కాధారముగ నున్నది ఆత్మ. ఉప్పు, ఉప్పగా నుండుట. పంచదార తియ్యగా నుండుట, కాకరకాయ చేదుగా నుండుట ఇవి అన్నియూ వస్తువుల గుణములు. గుణమునకు ప్రకృతి ఆధారము. అట్టి ప్రకృతికి తత్త్వమాధారము. దానినే 'ఆత్మ' యందురు.

మానవులు జీవాత్మలు. అనగా జీవము (ప్రాణము) వున్న ఆత్మలు. ఈ జీవాత్మలు త్రిగుణములకు లోబడి యుండును. నిజమున కవి అన్నియూ గుణములనుండి పుట్టినవే. గుణములు ప్రకృతి నుండి పుట్టినవి. ప్రకృతి తత్త్వమునుండి పుట్టినది. ఇట్లు ప్రకృతి గుణముల కావల అందరి యందు ఆత్మ యున్నది. గుణముల కీవల జీవాత్మ లున్నవి. జీవాత్మలకు కూడ ఆత్మయైన వాడు అఖిలాత్మకుడు. సచేతనములు, అచేతనములుగ జీవులుండగ వాటికాధారమై నిలుచు తత్త్వమే పరతత్త్వము. అదియే గురు తత్త్వము.

## 28. కేవలమ్ (3-5) :

తనకు తానుగ నుండునది. ఏమియు లేనప్పుడు కూడ నుండునది. దీనిని తెలియుటయే కైవల్య స్థితి అందురు. "*శ్రీ కైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్.*" అని శ్రీమద్భాగవతము తెనుగున ప్రారంభింపబడినది. అన్నిట, అంతటా తానే నిండియుండి ఇతరముల ప్రభావము లేక యుండుట కేవలము అనబడును.

## 29. నిజశుద్ధమ్ (3-6) :

పరిశుద్ధమైనది, సహజముగ శుద్ధమైనది. కాలము, ప్రకృతి, మాయ అంటనిది. గుణములు, పంచభూతములు అంటనిది. పొడవు, వెడల్పు, బరువు, పరిమాణము వంటి పశుతత్త్వములు కూడ అంటనిది. ఏమియు అంటనిదై యుండి అన్నిటికీ మూలమై యుండెడిది. పారదర్శకము కలది. నీలముగా కనిపించు చోటు. రెండు వస్తువుల మధ్య గోచరించు చోటు.

## 30. ఏకమ్ (3-7) :

ఒక్కటిగ నుండునది. ఒక్కటియే రెండగును. ప్రకృతి పురుషులుగ అగును. మూడు గుణములుగ అగును. నాలుగు కాలములుగను, అవస్థలుగను అగును. ఐదు భూతము లగును. ఆరు వర్గము లగును. ఏడు లోకము లగును. ఎనిమిది ప్రకృతులుగ అగును. తొమ్మిది ఆవరణములుగ ఏర్పడును. ఒక్కటియే ఇన్నిగ గోచరించును. ఆ ఒక్కటి ఆధారముగ లేనిచో మిగిలినవి లేవు. అవి ఆ ఒక్కటికి ఆధారము కాజాలవు. ఇన్నిటిగ ఏర్పడినను, అన్నిటి యందు తానొక్కటిగనే యుండుట తత్త్వము యొక్క గొప్పతనము. ఇన్నిటిని అతిక్రమించి కూడ యుండును గనుక 'పది'గ తెలియబడు చున్నది. అది ఒకటి (1). దాని నుండి వచ్చు సృష్టి పూర్ణము (0). రెండునూ కలిపి 'పది' (10).

## 31. అజన్మమ్ (3-8) :

జన్మించనిది. ఇల్లు కట్టినపుడు ఇంటిలోని చోటు లోపలి చోటుగ ఏర్పడును. అంతకు పూర్వమది చోటే. చోటే లోపలి చోటుగ కన్పించును. దానికి కారణము కట్టడము. కట్టిన వెనుక వంటగది, పడక గది, భోజనముల గది ఇత్యాది విభాగములు కూడ ఏర్పడు చున్నవి. ఏ గదికి సంబంధించిన చోటులో ఆ పనులే జరుగు చుండును. అట్లే సృష్టి చోటులో జరిగినపుడు, ఇంటిలో గదులవలె, సృష్టిలో లోకము లేర్పడుచున్నవి. ఇన్ని లోకము లేర్పడక ముందు

యున్నచోటే లోకము లేర్పడిన తరువాత కూడ యున్నది. చేయు పనులనుబట్టి గదు లేర్పడినట్లు, చైతన్య స్థితులనుబట్టి లోకము లేర్పడును. పూజగదియందు, స్నానముల గదియందు వున్నది చోటే అయినను, చేసుకొనిన విభాగములనుబట్టి ఆయా కార్యములు చేయు చుందుము కదా! అట్లే లోకములు కూడను. ఇన్నిటి యందలి చోటు మాత్రము ఎప్పుడూ చోటుగనే యున్నది. దానికి పుట్టుక లేదు, చావు లేదు. దాని నాధారముగ పుట్టినవాటికి మార్పు, మరణము వుండును.

## 32. అప్రతి రూపకమ్ (3-9) :

ప్రతిరూపము లేనిది. పోలిక లేనిది. రూపమే లేని తత్త్వమును ఏ రూపముతోను పోల్చలేము. రూపమున్నచో ప్రతిరూప ముండును. ప్రతిరూప మున్నచో పోల్చవచ్చును. అసలు ఏ రూపము లేనిదానిని, ఏ గుణము లేనిదానిని దేనితో పోల్చగలము? అందువలన పర తత్త్వము అప్రతిరూపకమైనది.

పరతత్త్వము నుండి పుట్టిన కోటానుకోట్ల జీవులు కూడ నిజమునకు ప్రతిరూపము లేనివారే! ఒకరిని పోలిన జీవి మరియొకరు లేరు. ఒకరికున్న ముఖము మరియొకరికి లేదు. ఒక కంఠధ్వనిని పోలిన మరియొక కంఠధ్వని లేదు. ఇట్లు ప్రకృతిచేయు సృష్టిలో కూడ నకిలీలు లేవు. దేనికదియే అసలు. జీవులు పరమాత్మ స్వరూపులు కనుక ప్రతిజీవికిని దానిదైన ప్రత్యేకత దానికున్నది. ఇది ప్రకృతి మహిమ.

## 33. బ్రహ్మతత్త్వ వినిశ్చయమ్ (3-10) :

నిశ్చితముగ బ్రహ్మతత్త్వమై నిలచువాడు సద్గురువు. బ్రహ్మము అనగా సృష్టి బృహ్మణమునకు ఆధారమైనవాడు. బ్రహ్మము ఎల్లప్పుడునూ వుండెడివాడు. శాశ్వతుడు. సృష్టియున్నను, లేకున్నను వుండువాడు. సృష్టియందనేక స్థితులలో కూడ నుండువాడు. ఉండుటయే బ్రహ్మము తత్త్వము. స్థితులు చైతన్యమునకు సంబంధించినవి కాని, బ్రహ్మము నకు సంబంధించినవి కావు. బ్రహ్మమునకు స్థితిగతులు లేవు. ఉండుటయే నుండును. అట్టి వుండుటను సద్గురువు కూడ ప్రదర్శించు చుండును. స్థితితో సంబంధము లేక యుండుట అతడు రుచి చూపించును. స్థితి, అవస్థితి, ఉన్నత స్థితి యందుకూడ సమానత్వము ప్రదర్శించును. నిశ్చలమగు బ్రహ్మతత్త్వమనగ నేమో, నిశ్చయముగ అనుయాయులకు తెలుపుచు నుండును.

బ్రహ్మము కాలమునకు, దేశమునకు, ప్రకృతికి, శక్తికి, మాయకు కూడ అతీతుడు. అవి అన్నియు అతని నుండి వ్యక్తమై వృద్ధి చెంది అతనిలో లయమగును.

## 34. నిరతానుమోద సుబోధకమ్ (3-11) :

ఆనందమయ కోశమున అనుభవింపబడువాడు. భౌతికము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయ కోశముల కావల ఆనందమయ కోశ మున్నది. భౌతికానందముకన్న ఇంద్రియ ఆనందము గొప్పది. ఇంద్రియ ఆనందముకన్న మనో ఆనందము

గొప్పది. మానసిక ఆనందముకన్న విజ్ఞానమయ ఆనందము గొప్పది. విజ్ఞానముకన్న ఆనందమయ కోశానందము గొప్పది. ఆనందమయ కోశమున కారణములేని ఆనందము దక్కును. విజ్ఞానమయ కోశమున ఆనందమునకు విజ్ఞానము కారణము. మనోమయ కోశమున ఆనందమునకు భావములు కారణము. ప్రాణమయ కోశమున ఆనందమునకు ఇంద్రియ పరితృప్తి కారణము. భౌతిక లోకమున ఆనందమునకు బాహ్య విషయములు కారణము.

మొదటి నాలుగు కోశముల ఆనందముకన్న ఆనందమయ కోశ ఆనందము నిశ్చయముగ గొప్పది. కారణమేమనగా ఆనందమున కచ్చట కారణము లేదు. తనకు తానే ఆనందముగ నుండును. దీనినే 'నిత్యానంద' మందురు. ఇది యొక తన్మయ స్థితి. అనగా తాను కరిగిన స్థితి. అంతర్యామి ప్రజ్ఞ యందు కరిగిన స్థితి. అపుడు తాననగ అంతర్యామియే. అంతర్యామి అపరిమితు డగుటచే అపరిమితమగు ఆనంద ముండును. దానిని అనుభవించుటయే కాని, తెలుసుకొనుట యుండదు. తెలుసుకొనువాడు తెలియబడు విషయమున కరిగిపోయి నపుడు, తెలుసుకొనలేడు కదా! అందువలన ఆనందమే మిగిలి తెలియుట, లేకుండుట అను స్థితి యందుండువాడు సద్గురువు. సమాధి యందట్లుండును.

# 4వ శ్లోకము

## 35. బుద్ధిరూపకమ్ (4-1) :

బుద్ధియే రూపముగ కలవాడు. అనగా వెలుగు రూపము కలవాడు. ప్రతి జీవునికిని భౌతిక శరీరము, సూక్ష్మశరీరము, కారణ శరీరము ఏర్పడుటకు వలసిన అవకాశమున్నది. ఇందు భౌతిక శరీరము రక్తమాంసాదులతో కూడినది. దాని కాధారము సూక్ష్మ శరీరము. ఇది బంగారు కాంతితో నుండును. దీనిని హిరణ్మయ శరీరమని కూడ అనవచ్చును. యోగాభ్యాసమున ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ స్థితులను పొందునపుడు, ఈ శరీర నిర్మాణము (హిరణ్మయ శరీరము) కాగలదు. ఇది కలిగిననాడు మృత్యువును తెలిసి దాటుటకు వీలగును. ధారణ, ధ్యాన, సమాధి స్థితులను యోగాభ్యాసి చేరినపుడు బంగారుకాంతి శరీరమునుండి తెల్లని వజ్రపుకాంతి శరీరము నిర్మాణమగును. ఆ కాంతి సూర్యునికాంతి వంటిది. ప్రతిజీవుడును ఒక సూర్యుడే. సూర్యునికి సూర్యకాంతివలె జీవునికి బుద్ధియను కాంతి యుండును. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమల ద్వారా యోగాభ్యాసమును నిర్దిష్టముగ నిర్వర్తించుకున్న జీవునికి ఈ శరీర పరిణామములు కలుగును. సద్గురువు అట్టి పరిణామములను పరిపూర్తి గావించుకొని పరమాత్మతో అనుసంధానము కలిగి యుండును. అతడు మూడు శరీరములను కలిగి యుండును. అవసరార్థము ఏదో నొక శరీరమును వాడుచుండును.

## 36. అబుద్ధికమ్ (4-2) :

సద్గురువు బుద్ధిరూపమున నున్నను, దాని కతీతుడుగ కూడ నుండును. అతనికి రూపమొక వసతియే కాని, రూపమును దాటి తానున్నానను, స్పందనాత్మక ప్రజ్ఞగ నుండగలడు. విశ్వాత్మయందు తానొక స్పందనాత్మక బిందువై యుండువాడు సద్గురువు. అట్టివాడు బుద్ధి రూపమున, మనో రూపమున, భౌతిక రూపమున కూడ ప్రవేశించి పనిచేయు చుండును. ఆయాలోకములకు అవసరమగు కార్యములను, ఆయా దేహములనుండి నిర్వర్తించును. కార్యమేమీ లేనప్పుడు శరీరముల అవసరములేదు. అందువలన వాని కతీతమై కేవల స్పందనాత్మక ప్రజ్ఞగ నుండును.

## 37. త్రితయైకకూట నివాసినమ్ (4-3) :

సత్త్వ రజస్తమస్సులు అనునవి మూడు కూటములు. ఈ మూడు కూటములు గుణాతీత ప్రజ్ఞ నుండి ఏర్పడినవి. ఒకే చైతన్యము మూడు గుణములుగ ఏర్పడుచుండును. అవియే ఇచ్ఛ, జ్ఞాన, క్రియలు. ఈ మూడును లయమైనచో కేవల చైతన్యమే యుండును. అదియే మూడు కూటముల ఏకత్వము. అది ఒకటిగ వుండగలదు. మూడుగ కూడ నుండగలదు. మనయందు తెలివిగను, కోరికగను (ఇచ్ఛ), దానిని నిర్వర్తించు జ్ఞానముగను అటుపైన క్రియగను ఏర్పడు చుండును కదా! ఇట్లు ఇచ్ఛా, జ్ఞాన, క్రియలు తెలివి ఆధారముగ ఏర్పడుచున్నవి. తెలివికి పుట్టిన మూడు కూటములు, తెలివి అనే

కూటమి నుండే పుట్టినవి. కూటములు మూడు కూటము లందుండక కేవలము ఎరుక యందున్నచో ఏకకూట నివాసి యగును. ఆ ఏక కూటమి మూడు కూటముల ఏకత్వమే కదా! అందువలన సద్గురువు, త్రిత ఏకకూట నివాసి అయి వుండును. అవసరమును బట్టి గుణముల లోనికి దిగును. అవసరము లేనపుడు గుణముల కతీతమగు స్థితిలో నుండును.

## 38. నిరత ప్రకాశక నిర్మలమ్ (4-4) :

శుద్ధ చైతన్యము నిర్మల ఆకాశము వంటిది. దాని యందు భావములు అను మేఘములు క్రమ్మవు. అవి ఎప్పుడునూ ప్రకాశించుచునే యుండును. దీనినే 'బుద్ధిప్రకాశ' మందురు. సూర్యుని నుండి కూడ వెలుగున దిదియే. ఈ ప్రకాశమును మలిన మంటదు. మలిన మంటని నిత్యమగు ప్రకాశము కలవాడు సద్గురువు. బుద్ధి లోకమున కలిగిన జ్ఞానము వలన సద్గురువునందీ ప్రకాశ ముండును. జ్ఞానముకన్న పవిత్రమైన దేదియు లేదు. కావున అచట మలినములకు తావు లేదు. కావున సద్గురువు నిరత ప్రకాశకుడు, నిర్మలుడు.

## 39. నిజమూలకమ్ (4-5) :

తనకు తానే మూలమైనవాడు అని అర్థము. కాలమునకు, ప్రకృతికి, శక్తికి, మాయకు పరతత్త్వమే మూలము. ప్రకృతి నుండి పుట్టిన జీవులకు కూడ ప్రకృతి మూలము; ప్రకృతికి తాను మూలము. ఇట్లు సృష్టి యందలి సమస్తమునకు తానే ఆధారము. తానే మూలము.

తన కెవరు మూలము? తనకు తానే మూలము. అన్నిటికి మూలమైనవాడు, అన్నిటియందు నేనుగా వెలుగువాడు, అవి లేనపుడు కూడ నేనుగనే వెలుగుచు నుండును. ఈ మూలతత్త్వము తానే అని తెలిసినవాడు సద్గురువు. అతడు కూడ తానే మూలమని భావించును.

## 40. పశ్చిమాంతర ఖేలనమ్ (4-6) :

మూలాధార మందు క్రీడించువాడు. సృష్టి అవరోహణ క్రమమున నేను, తాను అను తత్త్వము ఉత్తరమునుండి తూర్పునకు, తూర్పునుండి పశ్చిమమునకు వ్యాప్తి చెందునని వేదము ఘోషించు చున్నది. ఉత్తరమందలి తత్త్వము, తూర్పుపడమరలుగ ఏర్పడునని; ప్రజ్ఞ, పదార్థములుగ తనను తాను విభజించుకొనునని; ప్రజ్ఞ, పదార్థముల కలయిక వలన రకరకముల స్థితి భేదములు పదార్థమున కేర్పడి లోకములు సృష్టింపబడునని; తూర్పున సూక్ష్మ ప్రజ్ఞగను, పశ్చిమమున స్థూల ప్రజ్ఞగను ఏర్పడునని; అటుపై అధస్సున స్థూల సృష్టి నిర్మాణము జరుగునని పురుషసూక్తము కీర్తించుచున్నది. (పశ్చాద్ *భూమి మథో పురః*) ఇట్లు లోకాతీతమైన తత్త్వమునుండి లోకము లేర్పడునపుడు ఉత్తరము, తూర్పు, దక్షిణము, పడమరలుగ నాలుగు స్థితులు నాలుగు దిక్కులుగ నేర్పడును. పశ్చిమమున చేరిన ప్రజ్ఞ అచట పదార్థమయ లోకములందు లీలార్థమై క్రీడించుచు నుండును.

జీవుని యొక్క పుట్టుక కూడ పై విధముగనే జరుగుచు

నుండును. శుక్రశోణితములు తల్లి గర్భమున పిండాకారమై నిలచి క్రమముగ జలమయమగు పిండాకారము సహస్రార మాధారముగ ఘనీభవించి, అటుపైన శిరస్సేర్పడి, శిరస్సు నుండి వెన్నెముక ఏర్పడగ వెన్నెముక కొసభాగము వఱకు ప్రజ్ఞ ప్రసరించు చుండగ సప్త కోశములుగ మానవు డేర్పడుచున్నాడు. ఇట్లేర్పడుట కాధారము- నేను అను తత్త్వమే. అది వెన్నెముక కొసవరకు వ్యాపించి యుండును. ఈ మార్గమునే 'సుషుమ్న మార్గ' మందురు. శిరస్సు, వెన్నెముక కలిపి యూహించినచో ప్రజ్ఞ ఒక గద వలె గోచరించును. ఇందు శిఖ భాగము- ఉత్తరము; ముఖ భాగము- తూర్పు; హృదయ భాగము- దక్షిణము; గుద భాగము- పశ్చిమము. పశ్చిమమునకు చేరిన ప్రజ్ఞ స్థూల పదార్థముతో కూడి ప్రపంచమున క్రీడించును. ఈ మొత్తము మార్గమును సుషుమ్న మార్గమని, 'బ్రహ్మదండ' మని 'కుండలినీ మార్గ' మని అందురు. అవరోహణ క్రమమున పశ్చిమము చేరిన ప్రజ్ఞ, ఆరోహణ మార్గమున ఉత్తరము చేరును. పశ్చిమమున చేరుట క్రీడించుట కొఱకే. క్రీడ తెలియనివారు బంధింపబడుదురు.

తత్త్వమెరిగిన గురువు ప్రపంచమున క్రీడించుచు అట్లు క్రీడించుట బోధించుచు నుండును. అతడు క్రీడార్థమే దేహమున నుండును గాని, బద్ధుడై కాదు.

శ్రీ వేంకటేశ్వర మంగళాశాసనమున వైకుంఠమునందు విరక్తి కలిగిన విష్ణుమూర్తి లీలార్థమై భూమిపై ఏడుకొండల యందలి

పుష్కరిణిని చేరినట్లు వర్ణించుటయందు కూడ ఈ భావము కన్పట్టును (*శ్రీవైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీతటే ...*)

## 41. నిజశుద్ధ సంయమి గోచరమ్ (4-7) :

సంయమము అనునది అష్టాంగ యోగమున ఉత్తమోత్తమ స్థితి. ధారణ, ధ్యాన, సమాధి స్థితు లేక కాలమున కలుగునపుడు ఏర్పడు స్థితి సంయమము. 'ధారణ' అనగా చైతన్యము చిందులు వేయక గమ్యము నందు లగ్నమై యుండుట. చిందులు వేయని చైతన్యము గమ్యము నందే లగ్నమై యుండగ గమ్యమే తానగుట 'ధ్యానము'. అనగా చూచువాడు, చూడబడు విషయమై నిలచును. చూచుట, చూచువాడు, చూడబడు విషయమై పోగా దానిని 'సమాధి' అందురు. దానినే 'కైవల్య' మని కూడ అందురు. అనగా కేవలము తాను అను ప్రజ్ఞయే వుండును. ఈ కైవల్యస్థితిని చేరినవాడు అవస్థితులకు గురి కాడు. అతడే శుద్ధుడు. అతడే 'శుద్ధ సంయమి'. నేను అను తత్త్వమున నిలచిన శుద్ధ సంయమి సద్గురువు.

సద్గురువు ఒక వ్యక్తి కాదు. ఒక ప్రత్యేకాత్మ కాదు. చూచుటకు ప్రత్యేకముగ గోచరించును. వ్యక్తిగ గోచరించును. కాని అది శుద్ధ సంయమమగు నేనను తత్త్వమే. విద్యుత్ పరికరమున గల విద్యుత్తు విశ్వమంతయు వ్యాపించిన విద్యుత్తే. ఒక పరికరమున గోచరించినను అది విశ్వమంతయు వ్యాపించి యున్నదే కదా! చూచువారిని బట్టి తత్త్వము గోచరించును. పరికరమును చూచువారెక్కువ. కాని అందు

పనిచేయుచున్న విశ్వవ్యాపక విద్యుత్తును చూచు వారరుదు. అట్లే గురు రూపమును చూచువారే మెండు. గురుతత్త్వమును చూచువారు అరుదు. తత్త్వమును చూచువారికి పరికర మొక సౌలభ్యము. పరికరమును మాత్రమే చూచువారికి తత్త్వ మందదు. జనులు చూచు సద్గురు రూపముల యందు భాసించు గురుతత్త్వము ఒక్కటే. రూపము లనేకములు. తత్త్వమును చూచువారికే సద్గురువు గూడ గోచరించును. రూపముతో ముడి పెట్టుకున్న వారికి అతడు గోచరుడు కాడు.

# 5వ శ్లోకము

## 42. హృద్గతమ్ (5-1) :

హృదయమున ప్రవేశించి వుండునది పరతత్త్వము. గురుతత్త్వము హృదయమునందే స్థితిగొని యున్నది. హృదయ పీఠమే వాని నివాసము. హృదయ మనగా, హృత్ + అయమ్, అనగా "నేనిక్కడున్నాను" అని అర్థము. హృదయము చేయు ధ్వని యందు మనసు లగ్నము చేసి దైవమును, గురువును వినుచు నుండుట ఒక సాధన. ఓంకార నాదమే హృదయమందు 'సోఽహమ్' అను శబ్దముగ వినబడుచు నుండును. సోఽహమ్ అను శబ్దమందలి సకార, హకారములను విడదీసినచో మిగులునది ఓంకారమే. సద్గురువు హృదయగతుడు. సదాచారుడైన శిష్యుడు అతనిని హృదయమునందే దర్శించగలడు. గురుశిష్యుల సమావేశము హృదయము నందే జరుగును. మనస్సును హృదయమున దీర్ఘకాలము లగ్నము గావింపలేనివారికి గురు దర్శనము దుర్లభము. దైవ దర్శనమునకు కూడ హృదయమే కేంద్రము.

జ్యోతిష పరముగ హృదయము సింహరాశికి సంబంధించి యున్నది. అందువలన హృదయపీఠమును సింహాసనము అందురు. సింహాసనముపైకి గురువు నాహ్వానించి ఆరాధించుట సంప్రదాయము. అందువలన హృదయము పవిత్రమగు స్థలమైనది.

## 43. విమలమ్ (5-2) :

మలమున కతీతుడు, మలినములు లేనివాడు అని అర్థము. మలినములన్నియు మనోమయ కోశమందు, ప్రాణమయ కోశమందు, అన్నమయ కోశమందును వుండును. బుద్ధికోశమున (విజ్ఞానమయ కోశము) వెలుగే యుండును గాని, చీకటి యుండదు. అజ్ఞాన ముండదు. అందువలన బుద్ధి గుహయందు మాత్రమే సద్గురు వుండును. అంతకన్న క్రింది లోకములకు దిగిరాడు. విమల స్థానమగు హృదయ స్థానమే విజ్ఞానమయ కోశము. అదియే అంతర్ గుహ. ఆ గుహ యందే గురు దర్శనము జరుగుచు నుండును. గుహ బంగారు కాంతితో విరాజిల్లు చుండును. సద్గురువు కూడ అదే కాంతి రూపమున దర్శన మిచ్చును.

## 44. మనోజ్ఞ విభాసితమ్ (5-3) :

పై తెలిపిన గుహయందలి గురు దర్శనము 'మనోజ్ఞము' మరియు 'విభాసితము'. గుహ యందలి గురుదర్శనము మనసును రమింప జేయును. రమించిన మనసు వికసించి కాంతివంత మగును. అనగా విభాసితమగును. అంతర్ గుహ గురు దర్శనము, మనోజ్ఞము, విభాసితము అని తెలియవలెను.

## 45. పరమాణుకమ్ (5-4) :

పరమాణువు అణువుకు మూలమైనది. అణువునకు కేంద్రము.

జీవు డణువుకాగ, దేవుడందు పరమాణువు. అణువు త్రిగుణాత్మకము. పరమాణువు త్రిగుణములకు కూడ మూలము. అణువునందు ధన సంజ్ఞ (ప్రోటాన్); ఋణ సంజ్ఞ (ఎలక్ట్రాన్); తటస్థ సంజ్ఞ (న్యూట్రాన్) కలవు. వానికి కేంద్రమైనది పరమాణువు. పరమాణువు త్రికోణ బిందువు. త్రికోణము త్రిగుణములే. వాటికి కేంద్రము మూలప్రకృతి. మూలప్రకృతికి మూలమైనవాడు పరమాత్మ. అతని మొదటి రూపము పరమాణువు (బిందువు). బిందువు గోచరమే. బిందువున కాధార మగునది అగోచరము. అట్లు అగోచరమైన తత్త్వము బిందురూపముగ గోచరించును. బిందువు ఆధారముగ త్రిగుణము లేర్పడును. త్రిగుణము లాధారముగ అణు వేర్పడు చున్నది. ప్రతి జీవుడు ఒక అణువే. ప్రతి అణువు ఒక జీవే. ఈ మహత్తు వర్ణింప నలవి కానిది.

## 46. నీలమధ్య సునీల సన్నిభ నాదబిందు నిజాంకుశమ్ (5-5):

నీలమగు ఆకాశమున మరింత నీలముగ, బిందువువలె వెలుగొందుచు, నాదించు తత్త్వము. పరతత్త్వము అనంతము, విశ్వవ్యాప్తము. దాని మొదటి వ్యక్తరూపము బిందువు. ఆ బిందువు విద్యుత్ నీలమువలె ప్రకాశించుచు, ఓంకారము నాదించుచు నుండును. బిందువున కావల అనంతమగు తత్త్వముండును. బిందువు వ్యక్తమైన తత్త్వము. ఆకాశమున వ్యక్తమగుటచే శబ్దము సహజగుణమై యుండును. నీలాకాశమున మిరుమిట్లుగొలుపు నీలపు బిందువు నాదించుచు నుండును. ఈ ఆకాశము హృదయాకాశము. దీనినే 'దహరాకాశము' అని కూడ అందురు.

హృదయపు గుహ హిరణ్మయ (బంగారు) కాంతితో నుండునని ముందు తెలుపబడినది. గుహ ఊర్ధ్వభాగము, ఊర్ధ్వలోకములకు దారియై యుండును. అందు ప్రవేశించినవారు సూక్ష్మమునందు ప్రవేశించిన వారగుదురు. సూక్ష్మమున అంతయు నీలముగ గోచరించును. రూపము లున్నను అవియును నీలముగనే యుండును. మరింత లోతులలో రూపము అదృశ్యమై నీలము, నాదము వుండును. నాదము ననుసరించుచు అనంతమగు నీలమున పయనించు చుండగ, నాదము పుట్టుకస్థాన మగు, పరమాణు రూపమున వెలుగొందు బిందువును చేరవచ్చును. ఆ బిందువు అత్యంత నీలమై ప్రకాశించుచు, మిరుమిట్లు గొలుపుచు నుండును. బిందువును భేదించిన వారు మూలమును చేరుదురు. అట్టి మూలముగ పరతత్త్వ మున్నది. ఆ తత్త్వమే పరమాణు బిందురూపముగ వ్యక్త మగును. దాని కాంతి విద్యుత్ కాంతి. ఓంకారము దాని నాదము. దానిని చేరుటకు ఆకాశమును చేరవలెను. ఆ ఆకాశమే హృదయాకాశము.

**47. సూక్ష్మ కర్ణిక మధ్యమ స్థిత విద్యుదాది విభాసితమ్ (5-6):**

కర్ణిక అనగా తామరతూడు. సూక్ష్మకర్ణిక అనగా తామర తూడు యందలి దారము. అట్టి సూక్ష్మమగు దారమువలె సుషుమ్నానాడి వెన్నెముక అంతయు వ్యాపించి యున్నది. ఆ నాడీ కేంద్రములే షట్చక్రములు. అందు ప్రవేశించుటయే యోగమున అంతర్ముఖ ప్రవేశము. హఠ యోగమున మూలాధారమందలి

సుషుమ్న ద్వారమున ప్రవేశించుట యుండును. రాజయోగమున అదే సుషుమ్న ద్వారము నందు హృదయమునుండి ప్రవేశించుట జరుగును. సూక్ష్మాతి సూక్ష్మమగు, నీలమగు తామరతూడు దారమువలె గోచరించు సుషుమ్న నాడి నిజమునకు ఒక గొట్టము. అందు నీలపు కాంతి, విద్యుత్ కాంతివలె ప్రకాశించు చుండును. ఈ నీలమగు కాంతియే వివిధమగు ప్రజ్ఞా కేంద్రముల యందు (షట్చక్రములందు) వివిధ కాంతులుగ గోచరించును.

అంతరంగ కాంతి దర్శనము లన్నియు సుషుమ్న యందుండి వెలువడినవే. ఆజ్ఞ యందు నీలపుకాంతి; విశుద్ధి యందు మరకత (నెమలి కంఠపు కాంతి) మాణిక్య కాంతి; అనాహత మందు బంగారము మొదలుకొని మెఱయుచున్న తేనె కాంతి; మణిపూరకము నందు ఎఱుపు పులిమిన సిందూరపు కాంతి; స్వాధిష్ఠానము నందు లేత పగడపు కాంతి; మూలాధార మందు ఎఱ్ఱమట్టి కాంతి (ఇటుక ఎఱుపు). ఈ కాంతు లన్నిటికిని నీలమే ఆధారము.

సుషుమ్న గొట్టములో నీలము మొదలుగా గల కాంతులతో ప్రకాశించు చోటును పరతత్త్వముగ తెలియవలెను. అదియే గురు తత్త్వము. ఈ విధముగ స్థితికొన్న తత్త్వము *'సూక్ష్మకర్ణిక మధ్యమస్థితి'*. దాని ప్రకాశము– *'విద్యుత్ ఆది విభాసితమ్'*.

మంత్రపుష్పము నందు *"నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా"* అనునది దీనిని గూర్చియే.

# 6వ శ్లోకము

## 48. పంచ పంచ హృషీకదేహ (6-1 ఎ) :

పంచ పంచ మనగా ఐదు ఐదులు (5 × 5). హృషీక దేహమనగా ఇంద్రియ తత్త్వములతో కూడిన దేహము. దేహము ఇరువది ఐదు తత్త్వములతో రూపొందినది. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు తన్మాత్రలు (రుచి, వాసన, చూపు, వినికిడి, స్పర్శ), ఐదు భూతములు, ఐదు ప్రాణములు- ఇట్లు ఇరువది ఐదు అంశములతో కూడి దేహ మున్నది.

కర్మేంద్రియములు : వాక్కు, చేతులు, కాళ్ళు, మూత్ర అవయవము, మలావయవము.

జ్ఞానేంద్రియములు : చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు.

పంచతన్మాత్రలు : వినికిడి, స్పర్శ, చూపు, రుచి, వాసన.

పంచభూతములు : ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి.

పంచప్రాణములు : ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము.

## దేహపుంజము (5 × 5 తత్త్వములు)

| పంచ భూతములు | పంచ తన్మాత్రలు | పంచ ఇంద్రియములు | పంచ కర్మేంద్రియములు | పంచ ప్రాణములు |
|---|---|---|---|---|
| ఆకాశము | వినికిడి | చెవి | వాక్కు | ప్రాణము |
| వాయువు | స్పర్శ | చర్మము | చేతులు | వ్యానము |
| అగ్ని | చూపు | కన్ను | కాళ్ళు | ఉదానము |
| జలము | రుచి | నాలుక | మూత్రావయవము | సమానము |
| భూమి | వాసన | ముక్కు | మలావయవము | అపానము |

ఈ ఐదు కూటములు కలిపి కళేబర మగుచున్నది. ఈ అయిదింటిని ఐదు మకరములని కూడ తెలుపుదురు. ప్రాణ మాధారముగ ఇంద్రియములు, ఇతర తత్త్వములు కూర్చబడి యున్నవి. వీటిని అధిష్ఠించి మనస్సు దేహమును పనిచేయించు చుండును.

## 49. మనశ్చతుష్క పరస్పరమ్ (6–1 బి) :

'మనశ్చతుష్క' మనగా అంతఃకరణములు. అవి నాలుగు. మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారము. ఈ అంతఃకరణ చతుష్టయము రూపమున జీవు డుండును. నేనున్నానని తెలియుట అహంకారము. బుద్ధి అనగా జీవుని తెలివి. చిత్త మనగా అతని స్వభావము. మనస్సు అనగా పై మూడింటి ఆధారముగ దేహమును నిర్వర్తింపచేయు శక్తి. మనస్సు బుద్ధితో చేరినచో సర్వము శుభప్రద మగును. బుద్ధిని వీడినచో అహంకారమున, స్వభావమున చిక్కును.

అహంకారము సంకర్షణ (బలరాముడు) రూపము. బుద్ధి ప్రద్యుమ్న రూపము. చిత్తము అనిరుద్ధ వ్యూహము. జీవుడు పనిచేయుటకు అంతఃకరణములు నాలుగు వ్యూహములుగ నున్నవి. అతనికి వాహన మగు దేహము ఐదు కూటములుగ నున్నది. జీవుడు వసించునది అంతఃకరణమునందు. అతడు పనిచేయుటకు, అనుభూతి చెందుటకు దేహము వాహనము. దేహము లేక జీవు డుండును గాని, జీవుడు లేక దేహ ముండదు. భాగవతమున దీనిని తెలుపు చక్కని పద్యమొకటి యున్నది.

*"జీవునికిని, దేహ పుంజమునకు,*
*వేరుగాని ఏకత్వంబు కానరాదు*
*చెడిన దేహంబు చెడుగాని పురుషుండు చెడదు*
*ఆతని కంత చేటు లేదు."*

జీవుడొక్కడే నాలుగు వ్యూహములుగ నుండును. అతడు దైవమువలె చతుర్భుజుడు, చతుర్మూర్తి, చతురాత్మ, చతుర్భావుడు. దేహము మాత్రము పుంజమని తెలుపబడినది. పుంజమనగా గుత్తి. ఐదు పుంజము లొక దేహమగు చున్నది. ఒక్కొక్క పుంజ మందు ఐదు అంశము లున్నవి. జీవుని, దేహమును పట్టి వుంచునది ప్రాణము. ప్రాణసూత్రము తెగుటను మరణించుటగ గుర్తింతురు. ప్రాణ సూత్రము సడలించుకొని జీవుడు పయనించుట యోగవిద్య. ఈ విద్య గురువధీనమున వుండును.

## 50. పంచభూత సకాయషట్క సమీరశబ్ద ముఖేతరం (6-1 సి) :

కాయషట్క మనగా ఆరుకోశముల శరీరము. 'పంచభూత సకాయషట్క' మనగా పంచభూతములతో ఏర్పడిన ఆరు విధములగు శరీర కోశములు. మన దేహము ఆరు కోశములతో కూడి యున్నది. ఆ ఆరున్ను వరుసగా యిట్లున్నవి. 1) భౌతిక శరీరము. 2) కామ శరీరము. 3) సూక్ష్మశరీరము. 4) ప్రాణశరీరము. 5) మనోశరీరము. 6) కారణ శరీరము (లింగ శరీరము).

ఇందు భౌతిక మందరికిని కనపడుచునే యుండును. ఈ శరీరము నాధారముగ జీవుడు బాహ్యమున ప్రవర్తించుచున్నాడు. కామమాధారముగ జీవుడు ప్రవర్తించును. దీనినే 'ఇచ్ఛ' అని కూడ అందురు. మనలోని కోరికల సముదాయము ఒక శరీరముగ- కామ శరీరమని పిలుతురు. ఇది ఇంద్రియములచే నిర్వర్తింపబడు చుండును. కోరికల పరితృప్తికి జీవులందరు అహర్నిశలు కృషి చేయుచునే యుందురు. మనసుతో ఆలోచించుట, బుద్ధితో వివేకించుట జరుగక, కోరిక కలుగగనే ఇంద్రియములు బలీయమగు గుఱ్ఱములవలె లాగుచుండగ, కామశరీరము జీవుని యింద్రియార్థముల వైపునకు పరిగెత్తించుచు నుండును. మానవజాతియం దెక్కువ భాగము కామము దాటినవారు కాదు. ఇంద్రియములను జయించినవారు కాదు. కామపరితృప్తియే మానవ జీవితవ్యాపారముగ యుగ యుగములుగ సాగుచున్నది. "ఇంద్రియములను జయించుడు" అని

గ్రంథములు బోధించుటలో జీవితమును కోరికలకే పరిమితము చేయరాదని అర్థము.

భౌతిక శరీరము, కామ శరీరముల కాధారముగ ప్రాణశరీర మున్నది. ప్రాణశరీరము ప్రాణము నందించి భౌతికమును నిల బెట్టును. ఇంద్రియములకు బలమిచ్చును. ఎడతెరపి లేక కోరికలలో జీవించువారికి ఈ ప్రాణశరీరము బలహీనపడును. కోరికలు అనారోగ్యము కలిగించగలవు. ప్రాణసంకటము కూడ కాగలవు. ప్రాణ శరీరము స్థూల శరీరమునకే గాక, అన్ని శరీరములకు కూడ ఆధారము. ఈ శరీరము మూడు స్థితులలో నుండును. స్థూల శరీరమున స్థూల ప్రాణముగ నుండును. సూక్ష్మ శరీరమున సూక్ష్మ ప్రాణముగ నుండును. కారణ శరీరమున కారణ ప్రాణముగ నుండును. జీవుని యందు స్పందనగ యుండును.

స్థూలప్రాణము స్థూలదేహమున కందించుటకు, జీవచైతన్యము దేహమున ప్రసరించుటకు, సూక్ష్మశరీర మొకటున్నది. ఈ శరీరము సూర్యకాంతిలోని ప్రాణమును, తెలివిని– నరములు, నాడుల ద్వారా ప్రసరింపచేయుచు నుండును. శరీరమందలి ప్రజ్ఞాకేంద్రము లాధారముగ (షట్చక్రములు) సూర్యుని వెలుగును, ప్రాణమును అందుకొని శరీరమున కందించుటకు ఈ సూక్ష్మశరీర ముపయోగ పడును. జీవుని స్థూల శరీరమునకు సూక్ష్మమగు నమూనా(model)గ ఈ శరీర ముండును (Blue Print). కోరికలు మితిమీరినపుడు,

మనోభావముల ప్రశాంతత చెదరినపుడు ఈ శరీరమునకు చిల్లులు పడును. దానివలన ప్రాణము సరిగా సరఫరా కాదు. అనారోగ్యము, మరణము వచ్చును. అట్లే తెలివిని కూడ ఈ శరీరము ప్రసారము చేయును గనుక పై కారణముగ తెలివి యందు హెచ్చుతగ్గు లుండుట, పొరపాటుపడుట, మరచిపోవుట, తెలివి తప్పుట యుండును. ఈ శరీరము పటిష్ఠముగ నుండవలెనన్నచో మనోభావములు, కోరికలు ఆదర్శవంతములై, ప్రశాంతములై, ధర్మయుక్తమై యుండవలెను. అట్లు ఏర్పడినపుడు సూక్ష్మశరీరము బంగారుకాంతితో మెఱయుచుండును.

అటుపైన మనోమయ శరీరము (పైన అనగా లోపలి కోశమని అవగాహన చేసుకొనవలెను.) ఇందుండి శరీరమునకు, ఇంద్రియము లకు అధిపతియైన మనసు పనిచేయు చుండును. మనసాధారముగ జీవుడాలోచించును. (అట్లే యింద్రియము లాధారముగ కోరు చుండును. భౌతిక శరీర మాధారముగ తిరుగు చుండును). మనసు జీవునిచే నియమింపబడిన ఉద్యోగి. జీవుడెట్లు చెప్పిన అట్లు చేయును. కాని జీవుని దమించి, జీవస్వభావము, మనసను ఉద్యోగిని నిర్దేశించు చుండును.

యజమాని జీవుడు. అతని స్వభావమే అతని భార్య. మనసు యజమాని బంటు (ఉద్యోగి). శరీరమును నిర్వహించుట కేర్పరచ బడిన బంటు. జీవుని స్వభావము, జీవుని దమించినచో భార్యా విధేయత అందురు. స్వభావము చెలరేగి పనిచేయుచుండగా, జీవుడు

అశక్తుడై యుండును. స్వభావమే బంటును నిర్దేశించు చుండును. అధికారి భార్య, అధికారి బంట్లను వినియోగించుట చూచుచుందుము కదా! ఈ పరిస్థితినే ఆడపెత్తన మందురు. సాధారణముగ అందరును మనస్సునే తూలనాడుదురు. నిజమునకు మనసు బంటు వంటిది. దానిని నడిపించునది, దాని స్వామికాక, గయ్యాళి గంపయైన స్వామి భార్య (స్వభావము). ప్రతి జీవుడును పురుషుడే. అతని స్వభావమే అతని భార్య. తన భార్య తన అదుపున నున్నచో తన కుటుంబము సక్రమముగ సాగును. లేనిచో విడదీయరాని చిక్కులు పడును. మనోమయ శరీరము దేహమును, ఇంద్రియములను నిర్వర్తించుట కేర్పరచబడినది. మనస్సు తటస్థమగు అద్దము వంటిది. దానినుండి స్వభావము ప్రతిబింబించుచు నుండును. దైవీస్వభావము, రాక్షస స్వభావము, మానుష స్వభావము జీవునివిగాని, మనస్సునవి కావు. ఆయా స్వభావములనే మనసు ప్రతిబింబించును.

అటుపైన ఆరవ శరీరము కారణ శరీరము. ఇదియే స్వభావ శరీరము. జన్మ జన్మాంతరముల నుండి జీవుడు కొనివచ్చుకొనుచున్న వాసన లన్నియు అందే యుండును. ఈ వాసనల కారణముగనే జన్మ లెత్తును. జీవుని ఆలోచనలకు, కోరికలకు ప్రపంచమున ప్రవర్తనము నకు కారణ మిక్కడే యున్నది. ఇందు బీజప్రాయముగ అన్ని సంస్కారము లుండును. మంచి విత్తనములతోపాటు పుచ్చు, చచ్చు విత్తనములు కలిసి యున్నట్లుగ కలగూరగంపగ ఈ శరీరమున జీవ సంస్కార మంతయు యుండును. ఇందు పుచ్చు, చచ్చు విత్తనములను

ఏరి వేయుట సాధన. కారణ శరీరము పరిపూర్ణముగ సంస్కారవంతమై నపుడు వజ్రకాంతితో మెఱయు చుండును. అపుడు దీనిని 'వజ్రశరీర' మందురు. ఈ శరీరమున జీవుడు వెలుగుచున్నపుడు కూడ తానున్నా నను భావన యుండును. అందువలన దీనిని *'లింగశరీర'* మని కూడ అందురు.

'పంచభూత సకాయషట్కము' తెలుపబడినది. అందు సమీరశబ్ద మున్నది. అనగా వాయువుచే జరుపబడుచున్న శబ్దము (సోఽహం). సమీర మనగా వాయువు. వాయువునకు అనాహతము కేంద్రము. అనాహతమున వాయువు సోఽహం అను శబ్దమును చేయుచు నుండును.

*'ముఖేతరం'* అనుటలో ఈ శబ్దము కన్న భిన్నమైనది. భిన్నమైన దనగా అతీతమైనదని కూడ అర్థము.

ఈ నామమున దేహమందలి ఆరు కోశములు, అందేర్పడిన శబ్దముకన్న, అతీతముగ సద్గురువున్నాడని (పరతత్త్వము) తెలుపుట జరిగినది. సద్గురువు ఓంకార స్వరూపుడు. అతడు 25 తత్త్వములుగల శరీరమున కతీతుడు. అంతఃకరణ చతుష్టయమైన అహంకారము, బుద్ధి, మనస్సు, చిత్తముల కతీతుడు. ఆరు శరీరముల కతీతుడు. అందు జరుగు శబ్దమున కతీతుడు అని తెలుపబడుచున్నది.

ఆరు శరీరముల కతీతమైన వాడెట్లుండగలడు? అనిపించును. అతనికి ఆకాశమే శరీరము (*ఆకాశం శరీరం బ్రహ్మ*). అతని

శబ్దమేమి? అనిపించును. ఓంకారమే అతని శబ్దము. అతని రూప మేమి? అనిపించును. మిరుమిట్లు గొలుపు నీలకాంతియే అతని రూపము.

## 51. పంచకోశ గుణత్రయాది సమస్తధర్మ విలక్షణమ్ (6-1 డి) :

పంచకోశములను, మూడు గుణములను మించి, ఆయా ధర్మములకన్న విలక్షణమైన తత్త్వము అని అర్థము. నిజమునకు ఆత్మకు ఉండుట అను తత్త్వము తప్ప లక్షణము లేవియు లేవు. త్రిగుణములకు వాటి వాటి ధర్మము లున్నవి. రజస్సు వలన సంకల్పములు కలుగుచుండును. తమస్సు వలన నిద్ర కలుగు చుండును. సత్వము వలన విశ్రాంతి కలుగుచుండును. అట్లే పంచ భూతములతో నిర్మితమైన పంచకోశములకు వాటి వాటి గుణము లున్నవి. ఇవి అన్నియూ ప్రకృతి ధర్మములు కలిగి వర్తించును. ఆత్మ తత్త్వము వీటికన్న విలక్షణమైనది. అది పంచభూతముల చేతగాని, త్రిగుణములచేతగాని బంధింపబడదు. అట్టి ఆత్మతత్త్వము అన్నిటికి మూలము. అదియే గురుతత్త్వము. అదియే పరతత్త్వము.

# 7వ శ్లోకము

## 52. పంచముద్ర సులక్ష్య దర్శన భావమాత్మ నిరూపణమ్ (7-1):

దర్శనమే లక్ష్యముగ ముద్రలను ధరించి ధ్యానించువారికి భావన యందు ప్రకటితమగు తత్త్వము అని అర్థము.

ధ్యానమునకు ఆసనములు, ముద్రలు చాల ఉపకరించును. పద్మాసనము, వీరాసనము, ఓడ్యాణ బంధము ఇత్యాది ఆసనములు ధరించి ధ్యానమున మన పూర్వులెందరో దివ్యానుభూతులను పొందిరి. ముద్రలను ధరించి మరింత ఆనందము పొందిరి. ముద్ర అను పదములో 'ముద' అను పదమున్నది. ముద మనగా ఆనందము. ఆనందము కలిగించునది ముద్ర అని ఒక భావము. అట్లే 'దృ' అను శబ్దము కారణ శరీరమునకు మూలము. దివ్య బుద్ధిమయ కోశమని, లింగ శరీర మని ముందు తెలుపబడినది. ఈ శరీరమున స్థితి చెంది ధ్యానించుట ఉత్తమము. ఇచ్చట జీవ ప్రజ్ఞ దేహాత్మ భావము విసర్జించి కేవలము జీవాత్మ భావనగ యుండును. అందువలన ఆసనములు, ముద్రలు, ఉత్తమ సహాయకారులుగ పెద్దలు తెలిపిరి.

ముద్రలు ధరించి గురుతత్త్వమును, పరతత్త్వమును ధ్యానించునపుడు ప్రాణశక్తి ఇనుమడించి ప్రసరించును. షట్చక్రములు ప్రచోదితము లగును. కుండలినీ చైతన్యము ఊర్ధ్వగతి పొందును.

ఆసనములను, ముద్రలను శ్రద్ధతో అనుసరించువారికి అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశములు అనుసంధానము చెంది, విజ్ఞాన కోశమున జీవుడు స్థితి పొందును. ఇదియే కారణ శరీరమునందు స్థితి గొనుట.

పంచ ముద్రలు అని శంకరులు పలుకుటలో ప్రధానముగ ముద్రలు ఐదు అని తెలియవలెను. అవి వరుసగా 1. హస్త ముద్ర, 2. మనో ముద్ర, 3. కాయ ముద్ర, 4. బంధ ముద్ర, 5. ఆధార ముద్ర.

ఈ ఐదు ముద్రల యందు కూడ మరల వివరములు కలవు.

*1) హస్త ముద్రలు :* జ్ఞాన ముద్ర, చిన్ముద్ర, యోని ముద్ర, భైరవీ ముద్ర, హృదయ ముద్ర.

*2) మనో ముద్రలు :* శాంభవీ ముద్ర, నాసికాగ్ర ముద్ర, ఖేచరీ ముద్ర, కాకి ముద్ర, భుజంగినీ ముద్ర, భూచరీ ముద్ర, ఆకాశ ముద్ర, షణ్ముఖీ ముద్ర, ఉన్మనీ ముద్ర.

*3) కాయ ముద్రలు :* ప్రాణ ముద్ర, యోగ ముద్ర, పాశినీ ముద్ర, మండూక ముద్ర, తాడగీ ముద్ర.

*4) బంధ ముద్రలు :* మహా ముద్ర, మహాభేద ముద్ర, మహా వేధ ముద్ర.

*5). ఆధార ముద్రలు :* అశ్వనీ ముద్ర , వజ్రోలి ముద్ర.

పై ముద్రల వివరణములకై యోగదర్శన గ్రంథములను సంప్రదించవచ్చును.

పై ముద్రలను ధరించి, ధ్యానించుట వలన చిత్తమున స్థిరము చిక్కును. స్థిర చిత్తమున దివ్యత్వము ప్రతిబింబించును. స్థిరచిత్తమునకే యోగ నియమము లీయబడినవి. యమ నియమాది ధర్మములను పాటింపనివారికి స్థిరచిత్తము లభింపదు. స్థిరచిత్తము లేనివారు ధ్యానము చేయలేరు. వారి ప్రార్థనలు కూడ దైవమును చేరవు. అందు వలన యమ నియమ ఆసనాది సూత్రములను పాటించి ముద్రా సహితముగ ధ్యానించుట తెలుపబడినది.

## 53. విద్యుదాది ధగద్ధగిత్వ సుచిర్వినోద వివర్ధనమ్ (7-2):

విద్యుత్ ఆదిగా గల ధగద్ధగాయ మానమైన కాంతిపుంజములై గోచరించి ఆనందము, వినోదము వృద్ధిచేయు నటువంటిది గురుతత్త్వము.

పై తెలిపిన విధముగ ధ్యానము చేయువారికి కాంతి దర్శనము సత్యము. ఇతరులకు కేవలము భ్రాంతి దర్శనములే యుండును. కాంతి దర్శనమున మెఱపు వంటి కాంతినుండి బంగారు కాంతుల వరకు అనేకానేక కాంతి దర్శనము లుండును. అట్టి అనుభూతి కలవారు అంతరంగమున చిరునవ్వుతో కూడి వున్నటువంటి తేజో మయమైన గురురూపమును కూడ దర్శించగలరు.

## 54. చిన్ముఖాంతర వర్తనమ్ (7-3):

చిన్ముద్ర ధరించి ధ్యానించువారి అంతరంగమున చిరునవ్వుతో దర్శన మిచ్చువాడు సద్గురువు.

మఠము వేసుకొని మోకాలి చిప్పలపై చేతి మణికట్లు నుంచి చూపుడు వ్రేలును మడిచి బొటన వ్రేలి మొదలున కాన్చి వుంచవలెను. వెన్నెముక నిటారుగ నుంచి స్మితవదనముతో భ్రూమధ్యమున మనసు లగ్నముచేసి దైవమును ధ్యానించుట చిన్ముద్ర యగును.

చిన్ముద్ర, జ్ఞానముద్ర హస్తముద్రలలో ప్రధానమైనవి. బుద్ధుడు చిన్ముద్రను, జ్ఞానముద్రను, భైరవీముద్రను నెక్కువగ వినియోగించినట్లు సంప్రదాయము తెలుపుచున్నది. కొందరు మహాత్ములు హృదయ ముద్రను, మరికొందరు యోనిముద్రను కూడ వినియోగించిరి. హస్త ముద్రలు అత్యంత ప్రాధాన్యమైన ముద్రలుగ సంప్రదాయము తెలుపుచున్నది. అధోముఖమై ప్రవహించు ప్రాణశక్తిని ఊర్ధ్వముఖము పట్టించు శక్తి హస్త ముద్రల కున్నదని పెద్దలు తెలుపుదురు. మెదడు నుండి హస్తముల వరకు, హస్తములనుండి మెదడు వరకు, ప్రజ్ఞాప్రవాహము సులభముగ సాగుటకు ఈ ముద్ర లుపకరించునని పెద్దలు తెలిపిరి. వీని సహాయమున మనసు సులభముగ, శీఘ్రముగ అంతర్ముఖము కాగలదు. అంతర్ముఖమై స్థిరముగనున్న మనస్సునకే గురు దర్శనము. దైవ దర్శనము లభించును.

## 55. విలసత్ విలాసమ్ (7-4):

కాంతిమయమైన లీలలు, క్రీడలు కలవాడు.

అంతరంగమున స్థిరమతులైన వారికి అంతయూ ఆనంద దాయకమే. కారణ మేమనగా వారు బుద్ధిలోకమున నుందురు. బుద్ధిలోకమున అనంతమగు దైవీ విలాసములు గోచరించును. అనేకానేక రమ్యములగు దివ్యలీలలు, క్రీడలు గోచరించును. అట్లు గోచరించినపుడు హృదయము పొంగి వారినుండి మధురాతి మధు రములగు స్తోత్రములు, గేయములు, వ్యాఖ్యానములు వెలువడు చుండును. జయదేవుని అష్టపదులు, తుకారాముని అభంగములు, అన్నమాచార్యుల వారి సంకీర్తనములు, త్యాగరాజ స్వామి కృతులు, కీర్తనలు వారు స్వయముగ దర్శించి, రచించినవి. అట్టివారికి దివ్య విలాసమే సమస్తము. ప్రాపంచిక విషయముల యందు వారి విరక్తికి కారణము, దివ్య విషయముల యందు వారికి కలిగిన అనురక్తియే. సద్గురువు అట్టి అనుభూతిని అనుగ్రహింపగలరు.

## 56. అమాయికమ్ (7-5):

మాయ క్రమ్మని సత్యము. పై తెలిపిన వెలుగు క్రీడలన్నియు కూడా తత్త్వమాధారముగ ఏర్పడినవే. అట్టి వెలుగు క్రీడలకు కూడ అతీతమై తత్త్వమున జీవించువాడు సద్గురువు. అతడు పరతత్త్వమున స్థిరుడై యుండుటచే మాయ అతని నంటదు. మహాజ్ఞానులు సైతము

అమ్మ మాయ కధీనులే. అయినప్పటికి సద్గురువు అమ్మ కత్యంత ప్రియుడే. ఆమె గురుప్రియ. అనగా సద్గురువుల యందు ప్రీతి గలిగి యున్నటువంటిది. కారణము వారి లోక కల్యాణ దీక్షయే. నారదాది దేవర్షులు, వశిష్ఠ కుంభోద్భవాది మహర్షు లట్టివారు. ఆది శంకరులు కూడ అట్టివారే. శంకరులే అవతరించనిచో ఈ క్రీస్తు శకమున జ్ఞానము, గురుశిష్య సంప్రదాయము మరుగున పడి యుండెడి వేమో అనిపించును. కేవలము పరాశక్తి అనుగ్రహము కలవారే మాయను దాటిన వారగుదురు. సద్గురువు లట్టివారు.

# 8వ శ్లోకము

## 57 పంచవర్ణమ్ (8-1):

పంచవర్ణమును గూర్చి రెండవ శ్లోకమున వివరముగ తెలిపితిమి.

## 58. శుచి (8-2):

శుద్ధమైన తత్త్వము అని అర్థము. అనగా మలినములు తాకనిది. ఆకలిదప్పులే ప్రధానమగు మలినములు. సద్గురువు నవి అంటవు. పరతత్త్వమున తన్మయము చెందిన జీవునికి అంతర్ముఖము అగు పోషణ లభించు చుండును. రామకృష్ణ పరమహంస నెలల తరబడి సమాధి యందుండగా శరీరావశ్యకతలు మరచెను. ఏసు క్రీస్తుకూడ అట్లే నలుబది దినములు ఒక పర్వతముపై దైవసాన్నిధ్యమున నిలుచుట వలన ఆకలిదప్పులను మరచెను. వీరు నిజమగు ఉపవాసము చేసినవారు. అగస్త్య మహర్షి నిత్య ఉపవాసి యని కీర్తింపబడు మహనీయుడు. దేహాత్మ భావన ఎంత ప్రబలముగ నున్నదో అంత ఆకలి, దప్పిక యుండును. బంధములేక దేహమున జీవించు ముక్తజనులకు ఆకలిదప్పుల ఆవశ్యకతయే లేదు. కాని వారు చేయు దివ్యకార్యములకు దేహమావశ్యకము గనుక తగు మాత్రము నీరు, ఆహారము స్వీకరించుచు నుందురు. వాటిపై ఆధారపడి యుండరు. లభించనిచో కలత చెందరు.

## 59. విచిత్రమ్, విశుద్ధమ్ (8-3):

సద్గురువు ప్రవర్తన సామాన్యుల అవగాహనకు మించినది. వారి భాషణములు, చేష్టలు విచిత్రముగ నుండును. అవగాహనకు మించి యుండును. సాధారణ, సాంఘిక, ధార్మిక ప్రమాణములు వారికి వర్తింపవు. సద్గురువులు ఇసుకలో ఆహారమును కలిపి భుజించుట, స్నానాదికములు చేయకుండుట, విపరీత చేష్టలు చేయుచు ప్రదర్శించుట సద్గురువుల చరిత్రలలో కనపడుచుండును. అవధూతల యందు, మహాభక్తుల యందు ఇట్టి విచిత్రములు గోచరించుచు నుండును. అక్కల్‌కోట్ మహరాజ్, గజానన్ మహరాజ్, షిరిడి సాయిబాబా, రామకృష్ణ పరమహంస ఇట్టి విచిత్ర ప్రవర్తనలు చూపినవారు.

సద్గురువుల విచిత్ర ప్రవర్తనములు అప్పుడప్పుడు ప్రామాణిక శుద్ధి కలిగి యుండవు. కాని వారు విశుద్ధులే, అనగా విచిత్రమైన శుద్ధి కలవారే. అందువలన సద్గురువులు విచిత్రులు, విశుద్ధులు మరియు విచిత్ర విశుద్ధులు. వారు నిర్దేశించిన మార్గమున నడచుటయే గాని, వారి ప్రవర్తన కొలతల కందదు.

## 60. తత్త్వ విచారిణమ్ (8-4):

తత్త్వ విచారముచే తెలియబడువారు. తత్త్వమసి, అహం బ్రహ్మాసి, సోఽహం ఇట్టి పదముల విచారణముచే నామరూప గుణ

అతీత తత్త్వమును బుద్ధిలోకమున కొంతవరకు గ్రహింపవచ్చును. అటుపైన ధ్యానముచే దాని అనుభూతి యందు నిలువ వచ్చును.

సద్గురు వెప్పుడును తత్త్వ విచారము చేయుచు దానినే బోధించుచు నుండును. తత్త్వము వైపునకు మళ్ళింపని బోధకుడు సద్గురువు కానేరడు. సమస్తమునకు నేది ఆధారమో దానిని తెలియ చెప్పి, దానిని చేరు మార్గమును చూపువాడు సద్గురువు. "కుంభినీదవు *చెప్పెడి గురువు గురువు.*" అని భాగవతమున బోధింపబడినది.

నే నెవరు? నే నెచటనుండి వచ్చితిని, నే ననగా ఏమి? ఇట్టి ప్రశ్నలను గూర్చి విచారింపుడని రమణ మహర్షి తరచూ తన అనుయాయులకు బోధించెడివారు. "కుతోహమస్మి" ? అను ప్రశ్నను గూర్చి విచారింపుడని నిర్దేశించిన పరమగురువునకు, కుత్‌హూమి అను బిరుదాంకితము శిష్యులు గావించినారు. పరమగురువు దేవాపి తన అనుయాయులను ప్రప్రథమముగ ఆత్మజ్ఞాను లగుట ముఖ్యమని, అటుపై శాశ్వతముగ లోకహితులై జీవించ వచ్చునని బోధించిరి.

## 61. చంద్రసూర్య చిదగ్ని మండల మండితమ్ (8-5):

చంద్రమండల కాంతిగను, సూర్యమండల కాంతిగను, చిదగ్ని మండల కాంతిగను ప్రకాశించునది పరతత్త్వము (గురుతత్త్వము).

చంద్రుడు వెలుగుటకును, సూర్యుడు ప్రకాశించుటకును, అగ్ని ప్రజ్వలించుటకును ఆధారము శుద్ధచైతన్యమే. అట్టి చైతన్యమున

కాధారము పరతత్త్వమే. పరతత్త్వమే అన్నిటికిని మూలము గనుక అదియే గురుతత్త్వము. పరుడే గురుడు. అది ఎవరియందు ప్రకాశించునో అతడొక గురుమూర్తి. పరమును తెలియనివాడు గురువు కానేరడు. భగవద్గీత యందు శ్రీకృష్ణుడు అర్జునునితో "చంద్రుని యందు, సూర్యుని యందు, అగ్ని యందు కల తేజస్సు నేనే అని తెలియుము" అని పలికినాడు. పరమాత్మయే శ్రీకృష్ణుడుగ దిగివచ్చుటచే అతడు జగద్గురువు. త్రైలోక్య గురు డతడే.అతని సాన్నిధ్యము పొందినవారెల్ల తమనుండి ఆ సాన్నిధ్యమునే ప్రకటింతురు. వారే గురుపరంపర.

చంద్రమండల కాంతి జీవుల దేహపోషణమున కాధారము. చంద్రుడే మనస్సుగ, దేహపోషణములు జరుగుచున్నవి. సూర్యమండల కాంతి జీవుల బుద్ధిగ పనిచేయును. బుద్ధి ఆధారముగనే జీవులు పరిణామము చెందుచు ఉత్తరగతిని పొందుచున్నారు. అగ్ని మండల కాంతి జీవుని ఆత్మ తత్త్వమును ప్రకాశింపచేయుచున్నది. ఆత్మ, బుద్ధి, మనస్సులుగ ఒకే తేజస్సు పనిచేయుచున్నది. దాని కాధారమైనదే పరతత్త్వము (గురు తత్త్వము).

మన యందు చంద్రునికాంతి ఎడమ కన్ను కాంతిగను, సూర్యునికాంతి కుడి కన్ను కాంతిగను, మూడవ కన్ను కాంతి ఆత్మ ప్రకాశముగను తెలియవచ్చును. వీనికాధారమగు పరతత్త్వము కూడ శిరస్సునందు స్థితిగొని యుండును. అష్టదళ పద్మమునందు కూడ

స్థితిగొని యుండును. దీనిని ఉత్తమ హృదయ కేంద్ర మందురు. అందు నారాయణ ప్రజ్ఞ వడ్లగింజ శిరస్సు మాత్రమున ధగద్ధగాయ మానమైన లోతైన నీలపు కాంతిగ పరమాణు రూపమై యున్నాడని వేదములు తెలుపుచున్నవి.

యోగమున పై మూడు కాంతులను ప్రసరింపజేయు నాడులుగ ఇడ, పింగళ, సుషుమ్నలను పేర్కొందురు.

సృష్టియందు ఈ మూడు కాంతులను విద్యుదాగ్ని, సూర్యాగ్ని, అగ్ని అందురు. మొత్తము సృష్టికే అగ్ని ఆధారము. అట్టి అగ్నికి "నేను" అను విశ్వాత్మ తత్త్వ మాధారము. అట్టి విశ్వాత్మ తత్త్వమునకు దారి చూపువాడు సద్గురువు.

## 62. ఘన చిన్మయమ్ (8-6):

గొప్పదైన చైతన్యమయము అని అర్థము. చైతన్యమును 'చిత్' అందురు. అది విద్యుదాగ్ని వంటిది. అది కన్నులకు, మనస్సునకు, బుద్ధికి కూడ అందని కాంతి. బుద్ధికి, మనస్సుకు, ఇంద్రియములకు ఆధారమైన కాంతి. అది మనలో ఎరుక వలె పనిచేయుచు నుండును. ఎఱుక లేనిదే బుద్ధి లేదు, మనస్సు లేదు, చూచుటయు లేదు. ఎఱుక మన అధీనమున లేదు. ఎఱుక అధీనముననే మనమున్నాము. అట్టి ఎఱుక సమస్త జీవుల యందు, గ్రహగోళముల యందు, సూర్య మండలము నందు, సవితృ మండలము లందు, తారకల యందు,

త్రిమూర్తుల యందు కూడ నిండియున్నది. ఇట్టి దైవసృష్టి ఎఱుకను ఎవ్వ రూహింపగలరు? అదియొక మహాచైతన్యము; గొప్పదైన చైతన్యము. అట్టి చైతన్యము మనయందు కూడ యుండుట అనుగ్రహము. మహత్తరమైన చైతన్యమే మనయందు కూడ నిండి యున్నది. మహత్తర మనగా, మహత్తును కూడ దాటియున్న చైతన్య మని అర్థము. అట్టి చైతన్యము పరిపూర్ణముగ జాగృతి చెందినపుడు మనిషి మహాత్ము డగును. అతడే గురువు. అతడు 'ఘన చిన్మయుడు'.

## 63. చిత్కళా పరిపూర్ణ మంతర చిత్సమాధి నిరీక్షణమ్ (8-7):

పరిపూర్ణమగు చైతన్య కళలకు, అంతరమున సమాధి స్థితి యందు నిరీక్షించుచు నుండువాడు.

చిత్సమాధి అనగా నిద్రవంటి స్థితి. కాని నిద్ర కాదు. నిద్రించు చున్నట్లనిపించును. కాని మెలకువ యుండును. పురాణము లందు పరమశివుడు, నారాయణుడు చిత్సమాధి యందున్నట్లు తెలుపబడినది. వారు జీవుల కొఱకై నిరీక్షించుచు యుందురు. అరమోడ్పు కనులతో సృష్టినంతను అనుగ్రహించుచు నుందురు. సృష్టి, జీవుల పరిణామము కొఱకే. పరిణామము చెందుటకే ప్రకృతి అనేకానేక లోకములుగ, సర్గము చెందినది. కోటానుకోట్ల జీవులు వారి వారి ఎఱుకను బట్టి ఈ లోకములలో నిండిరి. ఎఱుక పెరుగుచుండగ జీవులకు పరిణామము కలుగుచుండును. జీవుల పరిణామమునకు పరతత్త్వము నెరిగిన మహాపురుషులు ఒక పరంపరగ నేర్పడుట కూడ దివ్య

సంకల్పమే. సనక సనందనాదులు, నారదుడు, సప్తర్షులు, వారి అనుయాయులు ఒక పరంపరగ లోకములందు సంచరించుచు ఇతోధికముగ జీవులకు సన్మార్గ దర్శకులుగ వర్తించుచున్నారు. వీరందరును జీవులు సమాధిస్థితి చేరుటకు వలసిన సహాయ సహకారముల నందించుచు, నిరీక్షించుచు నుందురు. సమాధి స్థితి చేరినవారు పరిపూర్ణముగ గురువందించిన సహాయ సహకారములను తెలుసుకొని సంభ్రమాశ్చర్యములు చెందుదురు. నిజమునకు సృష్టి యందు గురు పరంపరే లేనిచో జీవులకు పరిణామమే లేదు. తమ తమ శిష్యులను ప్రచోదనము కావించుచు జన్మల తరబడి వారి వెంట దృశ్యాదృశ్యముగ నుండి వలసిన ప్రచోదనము కలిగించుచు ప్రతి శిష్యుడు సమాధి స్థితి చేరునంతవరకు అనుగ్రహించుచు, వాని కొఱకై శ్రమించుచు చిత్సమాధి యందు వేచి వుండెడి సద్గురువు నెంత ప్రశంసించినను అది స్వల్పమే అగును కదా!

## 9వ శ్లోకము

### 64. హంసచారమ్ (9-1):

హంసవలె చరించువాడు, హంసమార్గమున నడచువాడు శ్రీ గురుడు అని అర్థము.

హంస మార్గమనగా స్పందన మార్గము. సోఽహం అను ద్వయాక్షరీ శబ్దమును చేయుచు స్పందన మున్నది. ఇట్లు ప్రతి జీవి యందును స్పందన మున్నది. మొత్తము సృష్టి అంతయూ స్పందనమే. స్పందనము విచ్చుకోలు, ముడుచుకోలుగ జరుగుచున్నది. స్పందనము లేనిచో సృష్టియే లేదు. ప్రతి జీవుడును స్పందనాత్మక చైతన్యమే. స్పందనమందలి విచ్చుకోలు, ముడుచుకోలు రెండు శబ్దములు చేయును. ఆ శబ్ద ద్వయమే సోఽహం. దీనిని 'స్పందన గాన'మని, 'హంసగాన' మని అందురు.

తాను కేవలము స్పందనాత్మక చైతన్యమే అని తెలిసినవాడు, తెలిసినవాడు. అట్టి వానిని 'హంస' అని పిలుతురు. స్పందనము మనయందు సుషుమ్న మార్గమున షట్చక్రముల యందును చరించుచు నుండును. జీవుని ప్రజ్ఞాస్థితిని బట్టి మూలాధారము నుండి సహస్రారము వరకు చరించ గలదు. ఈ స్పందన చరించు మార్గము సుషుమ్న మార్గము. హఠయోగమున మూలాధారము నుండి ఈ ప్రజ్ఞను ఊర్ధ్వముఖము గావించు ప్రక్రియలున్నవి. రాజయోగ

మార్గమున హృదయమందున్న ఈ స్పందనమును చేరి, ఊర్ధ్వగతి చెందుటకు ప్రక్రియలున్నవి. రెంటికిని నియమములున్నవి.

నియమబద్ధమగు జీవితమును జీవించువారు మనస్సు శ్వాసపై లగ్నము చేసినచో, ఉచ్ఛ్వాస జరుగునపుడు 'సో' అను శబ్దము వినిపించును. నిశ్శ్వాస చేయునపుడు 'హం' అను శబ్దము సహజముగ వినిపించును. ఉచ్ఛ్వాస, నిశ్వాసల ననుసరించుచు, వాని మూలమున కేగినచో, హృదయమున స్పందనము వినిపించును. దాని శబ్దము కూడ 'సోఽహం' అని వినిపించును. ఈ శబ్దమును వినుచు హృదయమున నిలచినవారు అంతర్ముఖులై ప్రశాంతతను పొందుదురు. హృదయముచేయు హంస గానమును వినుచు ప్రశాంతి చెందుదురు.

"సోఽహం" అనగా సహ. 'అహం' అనగా అతడే 'నేను'. అతడనగా పరుడు (గురుడు). అహం అనగా 'నేను'. 'అతడే నేను', 'అతడే నేను' అనుచూ హృదయము హంసగానము చేయుచు నుండును. 'హృదయం' అనగా 'హృత్ + అయం', "నేనిక్కడున్నాను" అని అర్థము. 'నేను' అనునది అంతర్యామి ప్రజ్ఞ. అది హృదయమున స్థితిగొని యున్నది. ఈ ప్రజ్ఞనే గురువని, ఈశ్వరుడని, దైవమని పిలుతుము. ఆ ప్రజ్ఞను చేరినవారు తత్త్వము తెలిసిన వారగుదురు. దైవమే తానుగ నున్నాడని తెలియగలరు. "ఈశ్వర స్సర్వభూతానాం, హృద్దేశే అర్జున తిష్ఠతి" అని భగవానుడు పలికినాడు. అనగా "ఓ అర్జునా! సర్వభూతముల (జీవుల) హృదయములందు, ఈశ్వరుడు

తిష్ఠవైచుకొని యున్నాడు” అని అర్థము. హృదయ మందలి ఈశ్వరుని చేరుటకు ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలు స్పందనము చేయు హంసగానమున మనసు లగ్నము కావలెను. అట్లు లగ్నమై, హంసమార్గమున చరించు వారు తాము హంసల మని తెలియుదురు. అనగా స్పందనాత్మక చైతన్యములని తెలియుదురు. వారు సూక్ష్మలోక ప్రవేశము కలిగి దివ్యానుభూతులను పొందుచు క్రమముగ పరమహంస లగుదురు. వారే హంసచారులు. సద్గురు వట్టివాడు.

## 65. అఖండ నాదమ్ (9-2):

హంసమార్గమున చరించువారికి నాదమే ఆలంబనముగ నుండును. నాదము ననుసరించుచు సూక్ష్మలోకమునుండి, సూక్ష్మతర, సూక్ష్మతమ లోకముల లోనికి ప్రవేశింతురు. శ్రీకృష్ణుని వేణుగాన మట్లే జీవులను దివ్యలోకములలోనికి గొనిపోయెడిదని పురాణములు తెలుపుచున్నవి. ‘సోఽహం’ అను శబ్దమున హల్లులు విసర్జింపబడగ, ‘ఓం’ అను శబ్దము మిగులును. అదియే నాదము, ఓంకారనాదము. నాదము జరుగునది కాని, చేయునది కాదు. ఆ నాదమే సృష్టికాధారము. ఆ నాదమే స్పందనమునకు కూడ ఆధారము.

హంసగానమున హంసలైనవారు సూక్ష్మతర లోకములలోనికి ప్రవేశించినపుడు తాము నాదస్వరూపులమని తెలియుదురు. ఒకే నాదమందలి అణువులమని తెలియుదురు. అఖండ నాదమున శాశ్వతులుగ స్థితిగొందురు. వారినుండి కూడ ఆ నాదమే స్పందనమును, ఉచ్ఛ్వాసను ఆలంబనముగ గొని, వాక్కు రూపమున వ్యక్తమగు

చుండును. అట్టి వాక్కు దివ్యవాక్కై యుండును. ఆ వాక్కునే 'అశరీరవాణి' అని కూడ అందురు. అనగా అది కేవలము శరీర మందలి జిహ్వ ద్వారా ప్రపంచమున వినబడు మాట కాదు. సృష్టి మూలము నుండి ఓంకారము, స్పందనము, ఉచ్ఛ్వాసల నాధారము చేసికొని దిగివచ్చిన ప్రవాహము. అందువలననే అది సరస్వతి నది అని పిలువబడుచున్నది. సద్గురువు ఇట్టి అఖండ నాద స్వరూపుడు.

## 66. అనేకవర్ణమ్ (9-3):

అనేక రంగులు కలవాడని, అనేక అక్షరములు కలవాడని, అనేక శబ్దములు కలవాడని అర్థము. సద్గురువు రంగుల, అక్షరముల, శబ్దముల సారము తెలిసినవాడు. అతడు శబ్దములను, రంగులను, మంత్రములను ఉపదేశించుచు జీవులను నిర్దిష్ట మార్గములలో నడిపించును. అతడు అన్ని వర్ణములుగను వెలుగొందగలడు. జీవుల ఉన్నతికై కొందరికి మంత్రధ్యాన మిచ్చును. కొందరికి రంగుల ధ్యాన మిచ్చును. అందరికిని అక్షర జ్ఞాన మిచ్చును. అక్షర జ్ఞాన మనగా క్షరముగాని జ్ఞానము. శాశ్వతజ్ఞాన మిచ్చి అనేక విధములుగ అనుయాయుల వున్నతికై తోడ్పడును. అతడనేక వర్ణుడు.

## 67. అరూపకమ్ (9-4):

గురుతత్త్వమునకు రూపములేదు. అది ఏ రూపము నుండి పనిచేసిన ఆ రూపము గురువై భాసించును. "కనపడని దైవము ఎవరినుండి సాక్షాత్కరించునో ఆ రూపము గురురూపము." దీనినే

మాస్టరు ఇ.కె.గారు "*దైవము కనపడితే గురువవుతాడు*" అని పలికిరి. శ్రద్ధాళువులకు గురుతత్త్వము ముఖ్యము. తత్త్వదర్శనమే గమ్యము. తత్త్వము చేరుటకు రూపము ఆధారము. రూపములేని తత్త్వము గ్రహించుట కష్టము. అందువలన రూపము కూడ మన్నింపదగినది, పూజింపదగినది. ఏ రూపమున గురుతత్త్వము మనలను స్పృశించు చున్నదో ఆ రూపము కూడ పవిత్రమే అని భావించి, పూజించుట వినయ విధేయతలకు ప్రమాణము. ఇది భారతీయ సంప్రదాయము. ఈ సంప్రదాయమున నడచువారికి వినయము, విధేయత అబ్బును. నిరహంకార స్థితి కలుగును. అట్టి వారికే జ్ఞానము అందిన ఫల మగును. "*తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా*" అని శ్రీకృష్ణ పరమాత్మ సూత్రీకరించినాడు. కావున తత్త్వజిజ్ఞాసులకు తత్త్వమెంత ప్రధానమో అట్టి తత్త్వ మందించు రూపము కూడ అంతే ప్రధానమని మన సంప్రదాయము తెలుపుచున్నది. అరూపకమగు గురుతత్త్వమును ఒక రూపము ద్వారా చేరుట ఇందలి సూక్ష్మము.

## 68. శబ్దజాలమయమ్ (9-5):

పరతత్త్వము (గురుతత్త్వము) శబ్దజాలముతో నిండి యుండును. సృష్టి అంతయూ శబ్దజాలమయమే. శబ్దము లన్నింటికిని ఓంకారము ఆధారము. అది నాదమేగాని, భాషలోని అక్షరము కాదు. అందుండి పుట్టు మాతృకలు అక్షరములై నిలచినవి. అక్షరము లందు అచ్చులు, హల్లులు కలవు. అచ్చులు జీవులు కాగ, హల్లులు దేహము లగుచున్నవి. అచ్చుల, హల్లుల సముదాయమే వాఙ్మయము. వీని

అవగాహన కలవారు సృష్టి నిర్మాణ శాస్త్రమును తెలియగలరు. ప్రతి రూపమునకు కొన్ని అచ్చుల, హల్లుల సముదాయమే ఆధారము. అందులకే ప్రతిరూపమునకు ఒక నామ ముండును. ఆ నామము ద్వారా ఆ రూపము యొక్క స్వభావము తెలియనగును. దీనిని 'వ్యుత్పత్తి' అర్థమందురు. వ్యుత్పత్తి అర్థమనగా ఒక రూపము సృష్టింప బడుటకు ఆధారమగు శబ్ద సముదాయమే ఆ రూపమునకు పేరుగ పెట్టుట, రూపము లేర్పరచి, వానికాధారమైన శబ్దములను నామములుగ నేర్పరచుట దేవనాగరి సంప్రదాయము. అదియే సంస్కృత భాషగ అవతరించినది. ఇతర భాషల యందు ఈ ప్రజ్ఞ కొరవడినది. అందువలన సంస్కృత భాష లోతుపాతులను తెలియుట ద్వారా శబ్దజాల మయమైన పరతత్త్వమును తెలియవచ్చును. శ్రీగురుడు అట్లు తెలిసినవాడు.

దేహమందలి షట్చక్రముల యందు కల దళములలోని అక్షరములను, చక్రబీజములందుగల బీజాక్షరములను కూడ ఋషులీమార్గముననే తెలుసుకొనిరి. శబ్దములేని రూపము లేదు. శబ్దముల మార్పిడితో రూపములను కూడ మార్పు చేయవచ్చును. మరమ్మత్తు చేయవచ్చును. మంత్రములన్నియు నిర్దిష్టమగు ప్రయోజనము కొరకు. అట్లేర్పరచిన వారు ఋషులు. మంత్ర ప్రభావమున, స్వభావమున మార్పు తప్పక వచ్చును. స్వభావమున మార్పు దేహమున, రూపమున కూడ మార్పుగొని రాగలదు. శబ్దమును తెలిసినవాడు, సర్వము తెలిసిన వాడగును. శబ్దజ్ఞానము

అత్యుత్తమ జ్ఞానము. శబ్దోచ్చారణముతో ఈ జ్ఞానమునకు శ్రీకారము చుట్టవచ్చును.

## 69. చరాచర జంతుదేహ నివాసినమ్ (9-6):

చరించు జీవులు, చరించని జీవులు అని రెండు రకములుగ కోటానుకోట్లుగ జీవులున్నారు. వీటినే స్థావర జంగమములు అందురు. ఖనిజములు, వృక్షములు, స్థావరములు (కదలిక లేనివి), జంతువులు, మనుష్యులు, దేవతలు, రాక్షసులు కదలిక గలిగినవి. అన్ని జీవులును జంతువులే. జంతువులనగా పుట్టినవి అని అర్థము. కావున మనుష్యులు కూడ జంతువులే! కదిలెడివి, కదలనివిగ నున్న జంతువులలో పరతత్త్వము మూలముగ నున్నది. పరతత్త్వ ముండుట వలననే ఆ జంతువు లన్నియు నున్నవి. ఉండుట పరతత్త్వస్థితి. రాయి వున్నది, రాజు ఉన్నాడు. ఉండుట రెంటికిని సమానమే.

రాయి, రప్ప వంటి కదలిక లేని వస్తువులలో పరతత్త్వము గాఢనిద్రలో (మనమున్నట్లుగ) నుండును. వృక్షములలో నిద్రా స్వప్నముల స్థితి యందుండును. జంతువులలో మనసుగ మేల్కొంచి యుండును. మనుష్యులలో బుద్ధిగ మేల్కొంచి యుండును. ఇట్లందరి యందు దైవము స్థితిగొని యున్నాడు.

ప్రతిరూపము వెనుక దాని స్వభావము వుండును. స్వభావమున కాధారముగ జీవాత్మ యుండును. జీవాత్మకు ఆధారముగ పరమాత్మ యుండును. సాధారణముగ ఎదుటివారి స్వభావమును మాత్రమే

మనము గుర్తింతుము గాని, దాని కాధారమైన జీవాత్మను ఒక సోదరునిగ గుర్తింపలేము. కారణము మన స్వభావమే. స్వభావమున బద్ధులైనవారు ఇతరుల స్వభావములు మాత్రమే చూడగలరు. తమ స్వభావమునుండి తాము స్వతంత్రులైనవారు, తమను జీవాత్మలుగా గుర్తింతురు. ఆధ్యాత్మిక సోదరత్వము వీరికి సత్యమై నిలచును. స్వభావమున చిక్కుబడిన వారికిది కేవలము ఒక నినాదమే. అందరి జీవాత్మల యందు పరమాత్మయే యున్నాడని తెలియుట మరియొక మెట్టు. అది తానే అని తెలియుట తుదిమెట్టు. అట్లు తెలిసినవాడే సద్గురువు. అతడన్నిటి యందును తననే దర్శించుచు నుండును. అన్యమును దర్శింపడు. దీనినే 'అనన్యస్థితి' అందురు. అది చేరుట గమ్యమును చేరుట. అట్లు చేరినవాడు చరముల యందు, అచరముల యందు తానే వసించి యున్నాడని తెలిసియుండును. అట్టివారిని పూజించవలెనని శంకరుల ఆదేశము.

## 70. చక్రరాజ మనాహతోద్భవమ్ (9-7):

చక్రరాజమగు అనాహత చక్రము నుండి వ్యక్తమగువాడు శ్రీగురుడు.

యోగమున అనాహత చక్రమును అత్యంత ప్రధానమగు కేంద్రముగ గుర్తింతురు. మూలాధారము నుండి సహస్రారము వఱకు గల సప్త కేంద్రములలో అనాహతము నాలుగవది. అనాహత మాధారముగ ప్రజ్ఞ, పదార్థము సమతుల్యముగ నిర్వహింపబడును. "సమత్వం యోగ వుచ్యతే" అని శ్రీకృష్ణుడు యోగమును నిర్వచించి

నాడు. ప్రజ్ఞ పదార్థముల సమానత్వమే యోగమని చెప్పబడుచున్నది. యోగి తటస్థుడై, సమవర్తియై, ప్రజ్ఞను, పదార్థమును కూడ పరిపా లించును. నిజమగు యోగి పదార్థమును, ప్రపంచమును తూల నాడడు. ప్రజ్ఞకు పెద్దపీట వేయుట, పదార్థమును అశ్రద్ధ చేయుట పూర్ణయోగులందు కానరాదు. సమగ్రయోగమే యోగము. జనకుడట్టి యోగి. వశిష్ఠ, అగస్త్యులట్టివారు. ప్రపంచమున తమ వంతు కర్తవ్యమును నిర్వర్తించుచు జిజ్ఞాసువుల కాదర్శప్రాయులై యోగు లుందురు. వారు కుటుంబమును, వృత్తి వ్యాపారములను, సాంఘిక కార్యక్రమములను నిర్వర్తించుచునే యుందురు. ఆ కార్యములకు దివ్యస్పర్శ నందించుచు నుందురు. ప్రపంచమున నున్నను వారు ప్రాపంచికులు కారు. ఇట్టివారి స్థానము హృదయము.

శ్రీ గురుడు హృదయమే కేంద్రముగ పనిచేయును. హృదయము ప్రేమకు, ఆదరణకు, ఆత్మీయభావనకు సంకేతము. హృదయమునకు దిగువ భాగమున కల కేంద్రములు ప్రపంచమున కార్యములను నిర్వర్తించుటకు ఉపకరించును. మనసు, ఇంద్రియములు, శరీరము ఈ మూడు కేంద్రము లాధారముగ పనిచేయును. హృదయమునకు పైనగల మూడు కేంద్రములు ఆకాశమునకు, ఆత్మతత్త్వమునకు, పరమాత్మ తత్త్వమునకు కేంద్రములు. అనాహతము వాయు తత్త్వ కేంద్రము. సద్గురువు ప్రత్యక్ష బ్రహ్మ, అనగా వ్యక్తమగు బ్రహ్మము. వాయువే ప్రత్యక్ష బ్రహ్మముగ వేదములు కీర్తించుచున్నవి.

హృదయము వాయు కేంద్రమేకాక బుద్ధి కేంద్రము కూడ. రామాయణ మున వాయుపుత్రుడు హనుమంతుడు బుద్ధిశాలి అగు సద్గురువు.

బుద్ధిలోకమున స్థిరపడినవారు దివ్యత్వమునకు, మర్త్యత్వమునకు నడుమ వారధిగ నిలబడుదురు. గురుతత్త్వము ప్రాపంచిక జీవులను దివ్యమార్గమున నడిపించుటకు, దివ్యప్రజ్ఞలు ప్రపంచమున అవతరించుటకు వారధియై నిలచును. ఇట్టి కార్యము లన్నియు హృదయమే కేంద్రముగ జరుగును. సప్త కేంద్రముల అనుభూతి బడసిన వెనుక సద్గురువు హృదయమే తన నివాసముగ నేర్పరచుకొని జీవించు చుండును.

శ్రీ చక్రమేరువును 'చక్రరాజ' మందురు. సద్గురువు సప్త చక్రానుభూతి కలిగిన వాడగుటచే అతడు అట్టి శ్రీ చక్రమేరువునకు ప్రతీక. సద్గురు పూజనము, శ్రీ చక్రపూజనము ఒకటియే. అట్టి తత్త్వము వ్యక్తమగుటకు అనాహతమే సమగ్రమగు కేంద్రము. అనాహత చక్రము కూడ మూడు దళములొక అరగ, నాలుగు అరలతో శ్రీ చక్రమేరువును తలపించును. అనాహత చక్రమును గూర్చి వివరించుటకు ఒక సంపూర్ణగ్రంథ మావశ్యకము.

## 71. ఏక వర్ణమ్ (9-8):

పరతత్త్వము, గురుతత్త్వము ఒకే రంగు, ఒకే శబ్దము, ఒకే అక్షరముగ నున్నది అని అర్థము.

నీలమే అతని వర్ణము. తెలుపు రంగు అంతులేని లోతుగ

నున్నచో నీలముగ కనపడును. ఆకాశము తెల్లని వెలుగే అయినప్పటి కిని, లోతు తెలియనది గనుక నీలముగ కనపడును. తెలుపు రంగే అన్ని రంగులకు మూలము. అట్లే ఓంకారమే అన్ని శబ్దములకు మూలము. అందు 'అ, ఉ, మ' శబ్దము లున్నవి. ఆ మూడును త్రిశక్తులే. అవి ఆధారముగనే సృష్టి ఏర్పడుచున్నది. అట్టి ఓంకారమే సద్గురువు సాన్నిధ్యమును పొందు శబ్దము. అక్షరముల యందు కూడ ఓంకారమే ప్రథమాక్షరము. *'ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ'* అని వేదము స్తుతించుచున్నది. సద్గురువు అసలు నామము 'ఓం'. ఇతరము లన్నియు వ్యవహార నామములే. కనుక నతడు ఏక వర్ణుడు.

## 72. అతాపకమ్ (9-9):

తాపములు పోగొట్టువాడు అని అర్థము. తాపములను ఉపశమింపజేసి చల్లదనమిచ్చువాడు సద్గురువు. జీవునకు మూడు రకముల తాపములు కలవు. వానినే తాపత్రయము లందురు. తనను గూర్చి, తన కుటుంబమును గూర్చి, తన భవిష్యత్తును గూర్చి, వానికి అనుబంధమగు సమస్యలను చింతించుచు జీవుడు తాపము చెందుచు నుండును. అది మనో తాపముగను, ఇంద్రియ తాపము గను, దేహ తాపముగను అతనిని బాధించుచు నుండును. సద్గురువును ఆశ్రయించినవారు క్రమముగ ఈ తాపముల నుండి విముక్తిని పొందుదురు.

# 10వ శ్లోకము

## 73. జన్మకర్మ విలీన కారణ హేతుభూతమ్ (10-1):

పరతత్త్వము, గురుతత్త్వము జన్మ కర్మలకు అతీతమైనది (లేనిది) అయినప్పటికి జన్మకర్మల కదే కారణమై యున్నది. అనగా ఆధారమై యున్నది.

తత్త్వమునకు జన్మము లేదు; కర్మము లేదు. అది చోటువలె నుండునదని ముందు శ్లోకములలో తెలుపబడినది. చోటులో జరుగు కార్యక్రమముల నిర్మాణములు చోటు కంటవు. చోటు చోటుగనే యుండును. విద్యుత్ కాంతిలో జరుగు కార్యక్రమములు విద్యుత్తున కంటవు. కాంతి లేనిచో కనబడదు. కాంతిలో సత్కార్యములు జరుగవచ్చును, దుష్కార్యములు జరుగవచ్చును. అనేకానేక విధములైన కార్యక్రమములు జరుగవచ్చును. కాంతి లేనపుడవి జరుగలేవు కదా! కాంతి ఆధారముగనే జరుగును. సినిమాతెరపై పౌరాణికములు, జానపదములు, సాంఘికములు అగు కథలు- వివిధ సంస్కారములతో కూడిన పాత్రలతో నడచు చుండును. అవి ఏవియును సినిమాతెర కంటవు. తెరపై నవరసములు ఒలికించినను తెరకంటవు. హత్యలు, రక్తపాతము కనిపించినను తెరకంటవు. కాని, తెరలేనిదే ఇవి ఏమియు కనపడవు. సినిమాతెరయే సమస్త సినిమాలకు ఆధారము (కారణము). కాని సినిమాతెర వాటన్నిటికిని అతీతము. దాని కేవియును అంటవు.

శ్రీకృష్ణుడు భగవద్గీతయందు తాను సర్వమున కాధారమని, తన నుండి ఉద్భవించిన ప్రకృతి నుండి మూడు గుణములు జనించి, జన్మ కర్మల సృష్టి అల్లికను చేయుచున్నవని, తా నాధారముగనే ప్రకృతి చేయుచున్నదని, ప్రకృతి చేష్టలు తన నంటవని, తాను ఆధారమే కాని, కారణము కాదని అర్జుననకు వివరించెను. ఈ నామమున కారణ మనగా ఆధారమని అర్థము చేసుకొనవలెను.

మనయందు చైతన్యము, ప్రాణము, ఆత్మగ పనిచేయు చున్నది. ఆత్మయే మనము. ఆత్మ ఆధారముగ మన యందలి స్వభావము (ప్రకృతి) రకరకముల భావములను వ్యక్తము చేయుచున్నది. భావముల ననుసరించి భాషణము, చేష్టలు జరుగుచున్నవి. అవి ఆత్మ నంటవు. ఆత్మ చోటు వంటిది. విద్యుత్తు వంటిది. సినిమా తెర వంటిది. స్వభావమే కర్మలకు కారణము. జన్మలకు కర్మ కారణము. ఆత్మకు నిజమునకు జన్మము లేదు. కర్మము లేదు. కాని స్వభావమున చిక్కుబడిన ఆత్మలు మాయనుండి జన్మకర్మల ననుభవించుచుండును. సాధారణ జీవులకు స్వప్న మెట్టిదో సత్పురుషులకు జాగ్రదవస్థకూడ అట్టిదే. స్వప్నమునుండి మేల్కాంచిన వానికి 'స్వప్నమే కదా'! అని పించును. అట్లే సత్పురుషులకు మానవుల చేష్టలన్నియు స్వప్నావస్థగా గోచరించును. జననము, మరణము కూడ వారు స్వప్నము నందే అనుభవించు చున్నారని, అది ప్రకృతి వలన జరుగుచున్నదని తెలిసి జీవులను స్వప్నము నుండి మేల్కొలుపుటకు వారహర్నిశలు కృషి చేయుదురు.

ఆటలాడుచున్నప్పుడు కొందరు ప్రత్యర్థులుగ కనపడుదురు. ఆట ముగిసిన వెనుక వారు స్నేహితులే. నాటక మందు నాయకుడు, ప్రతినాయకుడు హోరాహోరీ పోరాడుదురు. నాటకమైన పిదప వారిరువురును ఒకరి భుజముపై ఒకరు చేతులు వేసుకొని సల్లాపము లాడుచు సాగిపోవుదురు. ఇందు క్రీడ, నాటకము తాత్కాలికములు. అట్లే జీవుల పాత్ర పోషణము కూడను. ఈ ఇది తెలిసినవారు, తెలిసినవారు. నాటకమున మరణ సన్నివేశము నటించినపుడు, నటుడు మరణించు చున్నాడా? తా నున్నానని తెలిసి, మరణమును నటించుచు రక్తి కట్టించును. అట్లే సత్పురుషులు దేహమరణ సమయమున మరణ సన్నివేశమును వీక్షించుచుందురు. మరణమును వీక్షించువారికి మరణము లేదు.

## 74. అబోధకమ్ (10-2):

తెలియ శక్యము కానిది గురుతత్త్వమని అర్థము. ఈ నామము మొదటి శ్లోకమున వివరింపబడినది.

## 75. జన్మకర్మ నివారకమ్ (10-3):

జన్మలను, కర్మలను వారించువాడు సద్గురువు.

జనన మరణములను దాటినవాడే ఇతరులకు మార్గము చూపగలడు. అట్లే సంచిత ప్రారబ్ధ కర్మలను దాటినవాడే ఇతరులను

దాటింపగలడు. శ్రీ గురుడు జన్మ కర్మలను దాటిన వాడగుటచే అవి ఎట్లు దాటవచ్చునో తెలుపును. మార్గమును సుగమము చేయును. మార్గమంతయు స్నేహితునివలె వెంటనుండి సహాయ సహకారముల నందించును. అతడొక మంచి మిత్రుని వంటివాడు. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతయందు కర్మల నుండి ఎట్లు విముక్తి చెందవలెనో మొదటి ఐదు అధ్యాయములలో బోధించినాడు. దేహమును కూడ స్వచ్ఛందముగ త్యజించు ఉపాయమును ఎనిమిదవ అధ్యాయమున బోధించినాడు. సంగము లేక కర్మ నిర్వహణము ఎట్లు చేయవలెనో తెలిపినాడు. ఓంకారము ననుస్మరణము చేయుచు దేహమునుండి ఎట్లు బయల్పడవచ్చునో వివరించినాడు. తాను జన్మకర్మల నాచరించి చూపినాడు. కర్మ బంధములను దాటిననే కాని జన్మ బంధనలను దాటలేరు.

కర్మ బంధము, జన్మ బంధము లేనప్పటికిని జీవుల ననుగ్రహించుటకే సత్పురుషులు (మహాత్ములు) దేహమును స్వీకరించి కర్మను నిర్వర్తించి చూపుదురు. రామకృష్ణాదుల, జనకాది రాజర్షుల జీవితములు అట్టివే. వశిష్ఠాది ఋషుల జీవితములును అట్టివే. ఋషులు, రాజర్షులు, మహర్షులు, బ్రహ్మర్షులు దేహము ధరించి జీవులకు మార్గదర్శకత్వమును వహింతురు. వారి బోధనలు, ఆచరణ జీవులకు వలసిన ప్రేరణ మిచ్చి, జన్మ కర్మల నివారణములకు సహాయపడును.

## 76. రుచిపూరకమ్ (10-4):

బుద్ధి అను వెలుగుతో పూరించువాడు సద్గురువు అని అర్థము.

జ్ఞానము ఆచరణ రూపమున స్థిరపడినపుడు, అది బుద్ధి అను వెలుగుగ ప్రకాశించును. వెలుగున్నచోట చీకటి కవకాశము లేదు. అజ్ఞానమున కవకాశము లేదు. బుద్ధి అను వెలుగు యందున్న వానికి సర్వము విదితమే. జ్ఞానబోధను చేసి, అనుయాయులను సత్ప్రవర్తనమున నిలిపి, బుద్ధి ప్రచోదనము గావించువాడు సద్గురువు. బుద్ధి అను వెలుగును రుచి చూచిన అనుయాయి తనను పరిపూర్ణముగ బుద్ధిలో నిలుపుకొనుటకు ఉద్యుక్తుడగును. పూర్ణమగు వెలుగు తనయందు నిండునంత వరకు ఇష్టాపూర్వకముగ సాగును.

రుచి అనగా వెలుగు అని కూడ అర్థము. రుచిపూరకము అనగా వెలుగుతో నింపువాడు అని అర్థము. అనుయాయులను వెలుగుతో నింపుటయే సద్గురువు ప్రధాన లక్ష్యము. సాధకునకు బుద్ధి ప్రచోదనము ప్రధానముగ జరుగవలెను. సద్గ్రంథము లెన్ని పఠించినను, సత్కార్యముల నెన్ని చేసినను భావము, భాషణము, చేష్ఠల యందు ఉన్నతమగు మార్పు కలుగనిచో సాధన యాంత్రిక మైనదని తెలియవలెను. ఆహార వ్యవహారములతో కూడిన సమస్త విషయము లందును సత్సాధకునకు బుద్ధియను వెలుగు ప్రకటింప బడుచుండును. అతడే సద్గురువునకు నిజమగు అనుయాయి. సద్గురు సాన్నిధ్యము అయస్కాంత సన్నిధి వంటిది. దాని సాహచర్యమున,

సాధకులు కూడ అయస్కాంతీకరణము చెంది భాసించవలెను. సద్గురువు దేహమునందు స్థితి గొనుటకు యిదియే ప్రధాన కారణము. జీవులకు సాన్నిధ్యమిచ్చి, అందు ఉన్ముఖులైనవారికి, బుద్ధియను వెలుగును ప్రసారము గావించి, వారిని బుద్ధిమంతుల చేయుటయే సద్గురువు దేహము ధరించుటకు ప్రధాన కారణము.

## 77. భవతారకమ్ (10-5):

జన్మలనుండి తరింపచేయువాడు. సాధకులయందు బుద్ధి అను వెలుగు, వెలుగుచు నుండగా క్రమముగ దేహబంధములు విడివడును. బుద్ధి ప్రవేశమువలన సాధకుడు క్షరమునుండి అక్షరములోనికి ప్రవేశించును. దేహేంద్రియ మనస్సులు క్షరములు. తాను, తన బుద్ధి అక్షరము. బుద్ధిప్రవేశము గావించినవారికి అక్షరత్వమున ఆకర్షణము పెరిగి క్షరము, నశ్వరము, తాత్కాలికమగు విషయముల నుండి వికర్షణ కలుగును. ఇది అంతయు యోగమార్గమున సాధకుడు వికాసము చెందుచున్నపుడు అతనియందు జరుగు భావపరమైన మార్పు. బుద్ధియందే నివాస మేర్పరుచుకొన్న సాధకునకు బుద్ధియను వెలుగు శరీర మేర్పడును. రక్త మాంసాదుల శరీరము ఉన్నను, లేకున్నను అతనికి భేదమేమి యుండదు. భౌతిక శరీరము రాలినను, తా నుండును అని తెలిసియుండును. ఇది అంతయు గురూపదేశమున సుసాధ్యము. ఈ కారణముగ సద్గురువు జనన మరణముల నుండి తరింపజేయు దివ్యమూర్తిగ ప్రశంసింప బడుచున్నాడు.

## 78. నామరూప వివర్జితమ్ (10-6):

గురుతత్త్వమునకు, పరతత్త్వమునకు ఇదమిద్ధమగు రూపము లేదని ముందు పలుమార్లు తెలుపబడినది. రూపమే లేనప్పుడు నామము లేదు. అతడు అరూపకుడు, అనామకుడు. అనగా రూపము, నామము లేనివాడు. అనగా వాటిని దాటినవాడు. వాటిచే బంధింప బడనివాడు. సద్గురువునకు తన రూపముపైన, నామముపైన వ్యామోహ ముండదు. అట్టివారి నామరూపములే కీర్తింపబడు చుండును. పూజింపబడుచుండును.

అందరి జీవుల ఆత్మల యందుండెడి ఈశ్వరుడే తానని తెలిసిన సద్గురువునకు అన్ని రూపములు తానే. అన్ని నామములు తనవే. ఏ నామము లేనివానికి అనంతనామము లేర్పడును. ఏ రూపము లేనివాడే అనంత రూపముల యందును వుండును. నామరూపాత్మక మగు జగత్తు వెలుపల, లోపల నిలచియుండు తత్త్వమును ఒక నామమునకు, ఒక రూపమునకు పరిమితము చేయుట ప్రాథమిక సౌలభ్యమేకాని, శాశ్వత సత్యము కాదు.

## 79. నిజనాయకం (10-7):

తనకు తానే నాయకుడు. పరతత్త్వముకన్న మించినది లేదు. అదియే గురుతత్త్వమని కూడ తెలుపబడినది. సమస్తమునకు తానే మూలమైనది గనుక తనకు నాయకత్వము వహించునది మరియొకటి

లేదు. పరునకు, గురునకు మరియొక నాయకు డుండడు. మరొక నాథుడు లేడు. ఈ విషయముననే త్యాగరాజ స్వామి తన కృతియందు చమత్కృతిగ ఇట్లు గానము చేసినాడు. "అనాథుడవు నీవు. మే మనాథులము కాము." జీవు లనాథులు కారు. వారికి ఆశ్రయించుటకు జగన్నాథు డున్నాడు. జగన్నాథునకు నాథుడు లేడు కదా! కనుక అనాథుడని తెలుపబడినది. అట్లే బ్రహ్మమును పొంది బ్రహ్మమైన సద్గురువు తనకు తానే నాయకుడు. అతనికిక నాయకులు లేరు. బ్రహ్మర్షులైన వశిష్ఠునకు, అగస్త్యునకు నాయకు లెవ్వరునూ లేరు.

## 80. సుఖదాయకం (10-8):

సుఖము నిచ్చువాడు అని అర్థము.

సుఖమనేక స్థితులలో నున్నది. శారీరక సుఖము, ఇంద్రియ సుఖము. మనోభావ సుఖము, బుద్ధిమయ సుఖము, ఆత్మ సుఖము. అన్ని సుఖములను ఇచ్చువాడు సద్గురువు. సుఖము లేకపోవుటకు జీవులలో గల అవకతవకలే కారణము. సద్గురువు జీవుని కోశములను పరిశుద్ధిచేసి, సక్రమముగ అమరిక చేసి చైతన్యము, ప్రాణము చక్కగ అవరోధములు లేక ప్రవహించునట్లు ఏర్పాటు చేయును. తగిన దీక్షను, శిక్షణను ఇచ్చును. దీక్ష, శిక్షణములు అంగీకరించి నిర్వర్తించు సత్సాధకునకు అన్ని లోకముల సుఖము సద్గురు వందించును.

# 11వ శ్లోకము

## 81. తప్తకాంచన దీప్యమాన మహాణుమాతృకమ్ అరూపకమ్ (11-1) :

అరూపకమైనవాడు, మహా అణు రూపకమై కరగించిన బంగారు కాంతితో మెఱయుచున్నాడు అని అర్థము.

తత్త్వము రూపమున కతీతమైనదని ముందు తెలుపబడినది. అరూపకమైన తత్త్వమే మహాణురూపము దాల్చును. తత్త్వము నుండి సంకల్పము మొదలుకాగ, చోటులో ఒక అండ మేర్పడును. దీనినే బ్రహ్మాండ మందురు. ఈ అండము నుండి మహాణురూపముగ విరాట్ పురుషుడు జనించును. అతడు షష్ఠభుజిగా తెలియబడుచున్నాడు. అదియే మహాణురూపము. అణువు నందు కూడ నేడు శాస్త్రజ్ఞులు ఆ రూపమునే దర్శించుచున్నారు. దీనినే యజ్ఞ పురుషుడని, చతుర్భుజుడగు శ్రీమహావిష్ణువని ఋషులు కీర్తించిరి.



సర్వజీవులును అణురూపములే. వారి నమూనా మహాణువు నందున్నది. ఈ మహాణువు నీలి వర్ణముకలదై దాని ఆవరణము కరగించిన బంగారు కాంతితో నుండును.

పై కారణముగనే శ్రీమహావిష్ణువు కాంతిమయమైన బంగారు ఆభరణములు, పీతాంబరములు ధరించినట్లుగా కవులు కీర్తించిరి. అతడి బహిఃప్రాకార మంతయు బంగారు వర్ణమే. అందువలననే అతనిని హిరణ్యప్రాకారు డందురు. "*పీతాంబర ధరం దేవం*" అని కూడ కీర్తింతురు. అతడు సహజముగ నీలమైన వాడైనను, అతని బహిరావరణ మంతయు కూడ కరగించిన బంగారు కాంతివలె నుండును. బంగారు రంగు కాంతి బుద్ధిలోక కాంతి; నీలిమ కాంతి ఆత్మలోక కాంతి. ఏ రూపము, వర్ణము లేనివాడు నీలకాంతియై, బంగారు కాంతియై వెలుగుచున్నాడు. సద్గురువు కూడ ఆ తత్త్వమునకు ప్రతీక కనుక అట్లే వెలుగుచు నుండును. అతడు తప్తకాంచన దీప్యమానుడు, మహాణు మాత్ర రూపుడు. రూపము లేనివాడు.

## 82. చంద్రకాంతక తారకైరవ ముజ్వలమ్ (11-4):

చంద్రకాంత మణివలెను, తారకలవలెను ప్రకాశించువాడు. చంద్రకాంతమణి పూర్ణచంద్రునివలె స్వచ్ఛమైన కాంతిని ప్రసరించు చుండును. చంద్రకాంతి నిర్మలత్వమునకు, ఆహ్లాదమునకు, చల్లదనమునకు ప్రతీక. సద్గురు దర్శనము కూడ అనుయాయులలో త్రివిధములైన అనుభూతులను కలిగించును. సద్గురు దర్శనము, దర్శన మాత్రముననే మనస్సునకు చల్లదనము కలుగును, ఆహ్లాదము కలుగును. స్వచ్ఛతను ప్రసాదించును. సద్గురువు మందస్మితము చేసినచో వెన్నెలవంటి కాంతి అతని ముఖము నుండి వ్యక్తమై పై

విధమగు అనుభూతి నందించును. సద్గురు దర్శనము సర్వశుభంకర మని, సర్వోపశమన మని శ్రద్ధాళువులగు శిష్యులకు అనుభవైక వేద్యము.

పూర్ణచంద్రుడు పదహారు కళలతో నుండువాడు. సద్గురువు పదహారు కళలను తనయందిముడ్చుకొని యుండువాడు. అతడు షోడశీ స్వరూపుడు. అతని ముఖము నుండి షోడశీదేవియైన లలితయే పలుకుచు నుండును. అతనియందు స్మితవదనయై స్థితిగొని యుండును. అతని కన్నుల నుండి, ముఖము నుండి ప్రకాశించుచు జీవులను నిర్మలము, ప్రశాంతము, ఆహ్లాదకరము అగు వెలుగులలోనికి ఆకర్షించును. చంద్రకాంత మణి ప్రభావమిట్టిదని పెద్దలు తెలిపెదరు. సద్గురువే నిజమగు చంద్రకాంతమణి.

తారకలవలె సద్గురువు ఎంత సన్నిహితుడో అంత సుదూరుడు కూడ. తారకలు ఎంత దూరమున నున్నవో తెలియుట కష్టము. అయినను కాంతిని ప్రసారించుచు నుండును. తారకలు, సౌర మండలముల గుంపులు అవి ఎన్ని యున్నవో ఎవరికిని తెలియవు. అట్లే సద్గురువు కూడ ఎంత గంభీరుడో, అతని వైభవ మెంతయో తెలియుట కష్టము. భూమి చుట్టును గల ఆకాశములో గోచరించు తారకల సమూహములే సవితృ మండలములను, సూర్యమండలము లను, గ్రహమండలములను, భూమండలమును నిర్వర్తించుచున్నవి. అట్టి తారకకాంతితో ప్రకాశించువాడు సద్గురు వని అర్థము. తారకల

జ్ఞానము విస్తారమైనది కనుక కేవలము పరిచయము మాత్రమే చేయబడుచున్నది. తారక అను శబ్దమున తరింపజేయు స్వభావము గలది అని కూడ గ్రహింపవచ్చును.

## 83. పరమాస్పదమ్ (11-5):

సర్వమునకు ఆధారమైనది. ఆధారమునకే ఆధారమైనది. సృష్టి కాధారము మూల ప్రకృతి. మూల ప్రకృతి కాధారము తత్త్వము. తత్త్వమునకు తనకు తానే ఆధారము. ప్రకృతికిని, కాలమునకు కూడ తానే ఆధారము. ప్రకృతి ఆధారముగ మూడు గుణములు పుట్టును. మూడు గుణము లాధారముగ ఏడు లోకములు పుట్టును. అన్నిటి యందు వ్యాపించి యుండు తత్త్వము అన్నిటికి ఆధారమై యున్నది. అన్నిటి యందు వుండుటగ వున్నది. ఈ వుండుట ఆధారముగనే అన్నియు వాటి వాటి స్వభావములను ప్రదర్శించు చున్నవి. స్వభావముల ననుసరించి రూపములను పొందుచున్నవి. అందువలన ఈ వుండుటనే సత్య మనిరి, తత్త్వ మనిరి. జగదాధార మనిరి. అదియొక రూపము నుండి ప్రకటింపబడినపుడు, ఆ రూపము సద్గురు రూపమై వెలుగొందును.

## 84. నీలనీరద మధ్యమస్థిత విద్యుదాది విభాసితమ్ (11-6):

నీరదమనగా నీరు నిచ్చు మేఘము అని అర్థము. నీల నీరద మనగా నీలి మబ్బు అని అర్థము. మధ్యమస్థితం అనగా అట్టి మబ్బులో

మధ్యలో నున్నటువంటిది అని అర్థము. విద్యుదాది విభాసితమ్ అనగా మెఱపువలె ప్రకాశించునది అని అర్థము. నీలిమబ్బుల మధ్యలో మెఱపు వలె ప్రకాశించు తత్త్వము.

మెఱపువలన మేఘములు కురియుట ప్రారంభించును. కురియుట వలన నారములు బిందువులై భూమిపై పడును. భూమి పులకించి మొలకెత్తును. ఇందు నీటి బిందువులు జీవులవంటి వారు. మెఱపు దైవశక్తి. అది ఆధారముగ జీవులు భూమిపై దేహము ధరించి వర్తించుచున్నారు. జీవులను నరులు అని కూడ అందురు. వారు దేహధారులై దిగివచ్చుట, అటుపైన పరిణామము చెంది తమ నిజస్థితి కేగుట సృష్టిచక్రము. ఇట్లు నరులను నడిపించు దివ్యము, అవ్యక్తమగు శక్తిని 'నారాయణ' అందురు. అతడు నారములపై తేలియాడు చుండును. నారము లనగా ఆకాశ జలములు. ఈ ఆకాశ జలములే జీవ సమూహములు. వాటిని అవతరింపచేయుటకే సృష్టి నిర్మాణము జరుగును. జీవులు అవరోహణ క్రమమున దిగివచ్చి, ఆరోహణ క్రమమున మరల నారాయణుని చేరుట జీవుల కథ. దిగివచ్చుటను, దక్షిణాయన మని, ఎక్కివెళ్ళుటను ఉత్తరాయణ మని, ఈ మొత్తము కథ నారాయణ మని ఋషులు కీర్తించినారు. సంవత్సర చక్రము రూపమున కూడ నారాయణు డిట్లు వర్తించు చున్నాడు. ప్రతి జీవుని చక్రమున కూడ వర్తించుచున్నాడు. ఇట్టి వర్తనమును తెలిసిన జీవుడు సద్గురువగు చున్నాడు. అతడు నారాయణుని ప్రతిరూపమే.

# 12వ శ్లోకము

## 85. స్థూల సూక్ష్మ సకారణాంతర ఖేలనం (12-1):

భౌతిక, సూక్ష్మ, కారణ లోకములలో క్రీడించువాడు.

స్థూల శరీరము, సూక్ష్మ శరీరము, కారణ శరీరములను గూర్చి ముందు వివరింపబడినది. కోరికలను దాటి కర్తవ్యముల యందే స్థిరపడినవారు సూక్ష్మ శరీరమును పొందగలరు. వారికి సూక్ష్మ లోక అనుభవము తక్కువ. మనోభావ పరిమితులను కూడ దాటిన వారు, కారణ శరీరమును కూడ పొందుదురు. వారికి కారణలోక అనుభూతి యుండును. సూక్ష్మలోకమున నంతయు బంగారు కాంతిమయ లోకముగ గోచరించి ఆనందము కలిగించును. కారణ లోకము వజ్రకాంతి మయముగ గోచరించి ఆనందము కలిగించును. మహాత్ము లందరికిని ఈ మూడు శరీరములు నిర్మాణమై యుండును. వారు మూడు శరీరములతో, మూడు లోకములందు సంచరించుచు నుందురు. వారు జీవించుటకు వ్యక్తిగత కారణము లేవియు వుండవు. కేవలము జీవులను వుద్ధరించుటకే ఈ శరీరములందుండి క్రీడింతురు.

సామాన్య జీవులు బాహ్య విషయముల కాకర్షింపబడి చిక్కుబడి యుందురు. మరికొందరు కోరికల మూలమున యింద్రియములందు చిక్కుబడుదురు. మరికొందరు మతములందు, సిద్ధాంతములందు, ఆదర్శములందు, ఆశయములందు చిక్కుబడి యుందురు. ఇట్లు

జీవులు మూడు రకములుగ చిక్కుబడి యుండుట సామాన్యము. ఈ చిక్కుల నుండి తమను తాము విడిపించుకొనుటకే యోగవిద్య, భక్తి, జ్ఞాన, వైరాగ్యములు తెలుపబడినవి. వీనియందు రుచి కలిగించి, ప్రవేశమిచ్చి నడిపించువారు సద్గురువులు. వారీ మూడులోకముల చిక్కులను దాటించుటకు ప్రేమపూరితులై మన పరిసరము లందు తిరుగాడుచు నుందురు. వారు జీవోద్ధారణ మను క్రీడయందా నందింతురు. వారందించు సున్నితమగు మెలకువలను శ్రద్ధా భక్తులతో అనుసరించువారు ధన్యజీవులు.

## 86. పరిపాలనమ్ (12-2):

ప్రేమతో జీవులను పోషించుట, రక్షించుట, పరిపాలించుట. పాలకులు అధికారముతో జీవులను రక్షించుట, పోషించుట అవసరమగుచో శిక్షించుట చేయుదురు. పరిపాలకులు రక్షించుట, పోషించుట, వృద్ధిని కలిగించుట, అట్టి వృద్ధికై శిక్షణ నిచ్చుట చేయుదురు. వారు శిక్షించరు. శిక్షణనే అందింతురు. పరిపాలకులది ప్రేమ మార్గము. కనుక ప్రేమతోనే సర్వమును నిర్వర్తింతురు. దండన మండనాదులు వారి మార్గమున లేవు. వారి దృష్టిలో తెలిసినవారు, తెలియనివారు అని యుందురు గాని, మంచివారు, చెడ్డవారు అని యుండదు. లోకములో చెడ్డవారుగ ఎవరిని సామాన్యులు గుర్తింతురో వారిని సద్గురువులు తెలియనివారిగను, మాయనుబడిన వారుగను గుర్తింతురు. వారిని కూడ ప్రేమతో సన్మార్గమున నిలుపుదురు. నారద

మహర్షి అడవి దొంగ అయిన రత్నాకరుని ప్రేమతో నుద్ధరించి మహర్షి అగుటకు దారి చూపెను. అంగుళీమాత్రుడను బందిపోటునకు ప్రేమతో బుద్ధుడు మార్గము చూపి ఉత్తము డగుటకు దారి చూపెను.

పాలనము అధికారముతో కూడి యుండును. పరిపాలనము ప్రేమతో కూడి యుండును. అచ్చట అధికారము లేశమాత్రమే. ప్రేమకు లొంగని దేమియులేదు. అయస్కాంతమునకు లొంగని ఇనుప ముక్క యుండునా? సద్గురువు లట్లు ప్రేమమయమూర్తులై ఆశ్రయించినవారిని పరిపాలింతురు.

## 87. విశ్వతైజస ప్రాజ్ఞ చేతసమ్ (12-3):

చైతన్యము సద్గురువు నందు మూడు విధములుగ ప్రకాశించు నని తెలుపబడుచున్నది. సద్గురువు కారణ శరీరమున ప్రవర్తించు నపుడు విశ్వచైతన్య మతనికి అందుబాటులో నుండును. ఆ శరీర మాధారముగ విశ్వప్రణాళికను అందుకొనుటకు, అందు తనవంతు కర్తవ్యము నిర్వర్తించుటకు సద్గురువు కారణ శరీరమును వినియోగించును. విశ్వాత్మ చైతన్యముతో రమించుటకు కూడ అతడు ఈ స్థితి యందుండును.

స్థూల శరీరమున సద్గురు ప్రజ్ఞ యున్నప్పుడు, అతని చేతస్సు తేజోవంతమై యుండును. అపుడతడు అమిత తేజస్సుతో వెలుగొందు చుండును. దివ్యకార్యములను భూమిపై అవతరింప చేయుటకు

అతడట్టి తేజస్సున ప్రకాశించుచు నుండును. భౌతిక శరీరమున పనిచేయునపుడు ప్రాజ్ఞుడై యుండును. అనగా ప్రకటింపబడిన జ్ఞానముగ నుండును. భౌతిక శరీరమున నున్న ఇతర జీవులవలె లౌక్యమున పడదు. ప్రజ్ఞయందే యుండి భౌతిక లోకమున కార్యములు నిర్వర్తించు చుండును. లౌకికముగ గోచరించు చున్నను, అతడు లౌక్యుడు కాడు. అతనిది విశ్వమయము, తేజోమయము, ప్రజ్ఞా మయము అగు చేతస్సు అని తెలియవలెను.

## 88. అంతరమ్ (12-4):

అంతరమ్ అనగా లోపల నుండునది. గురుతత్త్వము మరుగుగ నుండును, లోపలగ నుండును, కప్పబడి యుండును. అది శ్రద్ధాళువు లకే గోచరము. ఎప్పుడునూ వీధిన పడి యుండదు. బజారు వస్తువు కాదు. కొనుగోలు వీలుపడదు. అమ్మకము జరుగదు. సద్గురువు సామాన్యులకు తెలియబడడు. శ్రద్ధ, భక్తి, వినయము గలవారికే గోచరు డగును. హనుమంతుడు సాక్షాత్తు రుద్రుడని రామునికి తప్ప ఎవ్వరికినీ తెలియదు. సుగ్రీవునకు కూడ తెలియదు. ఇతరులను మభ్యపెట్టుటకు అతడు వానర రూపమును సైతము ధరించి యుండును. కేవలము రామునకు మాత్రమే సకల వేద పారంగతుడగు విద్యానిధి వలె కనుపించెను.

సద్గురువు అప్రకటితుడు. తనకు తాను ప్రకటము చేసుకొనడు. ప్రకటనములు వ్యాపార వృత్తి. సద్గురువు అట్టి వాని కతీతుడు. వేష

భాషలను బట్టిగాని, రూపమును బట్టిగాని అతనిని గుర్తించుట కష్టము. అతడు గుప్తముగ నుండును. గుహ యందుండును. అందులకే అతనిని గుహు డందురు. నిజమగు గురువు గుహుడే.

## 89. నిఖిలాంతరమ్ (12-5):

అన్నిజీవుల ఆత్మగా నుండువాడు. అన్ని జీవులకు కేంద్రముగ ఒకే తత్త్వ మున్నది. అది ఆధారముగనే జీవుడుండుట సంభవించు చున్నది. ఈ ఆధారమైన దానిని ఋషులు వేదమున 'అది' (తత్) అని పలికిరి. 'తత్ త్వం' అనగా అది నీవే. ఇది తెలియుటయే గురువును తెలియుట. ఇది తెలియుటయే ప్రతి జీవి తాను ఆత్మనని తెలియుట. ప్రతి "తాను", "నేను", ఒకే "తాను", "నేను" నుండి త్రిగుణముల కారణముగ వేర్వేరుగ కన్పట్టుచున్నది. సముద్ర మొకటే అయినను వేర్వే రలలుగ గోచరించు చున్నది కదా! అట్లే ఒకటే ఇన్నిగ గోచరించుచున్నది. ఇన్నిగ గోచరించుటకు కారణము ప్రకృతి. ఒకే సూర్య కిరణము ఒక త్రిభుజము నుండి బయటకు వెడలినపుడు ఏడు కిరణములుగను, ఏడు రంగులుగను గోచరించుట లేదా! ఒకే నాదము అనేకానేక శబ్దములుగ వినిపించుట లేదా? అట్లే ఒకడే అందరియందు, అందరివలె యున్నాడు. నాయందు నావలె, నీ యందు నీవలె, అతని యందు అతని వలె, దాని యందు అది వలె దీని యందు ఇది వలె గోచరించుచున్నను, వున్నది ఒక్కటే. వివిధముగ గోచరించుటకు కారణము ప్రకృతి. సద్గురువు అట్లు తెలిసినవాడు.

అట్లు తెలుపుటకే అతడు దేహమున వశించు చుండును. జీవుల నడుమ చరించుచుండును. తెలుసుకొను తపన గలవారి కతడందు బాటులో నుండును. అందుబాటులో నున్నను ఈ తపన లేనివానికి ఏమియు తెలుపడు. తెలుపవలెనను కండూతి (దురద) సద్గురువున కుండదు. తెలియగోరు తపన గలవారికి మాత్రమే తెలుపును. అందరికి తెలుపవలెనను భావము రజోగుణ దోషమున యుండును. సద్గురువు నందు రజస్తమస్సులు సత్త్వమున ఇమిడి యుండును. అతడు సత్త్వమును అధిష్ఠించి నిత్య సత్త్వస్థితి యందు ఉండును. దీనినే గుణాతీత స్థితి యని కూడ తెలుపుదురు. అతడు అందుకొను వారికి అందుబాటులో నుండును.

## 90. సర్వకారణమ్ (12-6):

అన్నిటికి కారణమైనవాడు. ఈ తత్త్వము ముందు వివరింప బడినది. కారణమనగా ఆధారము అని తెలుపబడినది. నిజమునకు కారణము ప్రకృతియే. కాని ప్రకృతి కాధారము పరతత్త్వము. శివుడు లేని శక్తి లేదు. శివుడు ఆధారముగ శక్తియే సమస్తమును నిర్వహించు చున్నది. శక్తియే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగ త్రివిధము లగును, త్రిగుణము లగును. త్రిగుణము లాధారముగ సప్తలోకములను ఏర్పరచును. లోకములుగను, లోకముల రూపమున, లోకస్థుల రూపమున, లోక పాలకుల రూపమున, శక్తి ఏర్పడగ వాటి సమస్తము నకు ఆధారముగ శివుడుండును. శివుడేమీ చేయుచున్న ట్లుండడు.

శక్తియే అంతయు చేయుచున్న ట్లుండును. నిజమునకు శివుడులేని శక్తి లేదు. కనుక అతడే కారణ మనవచ్చును. సర్వకారణు డనగా చేయక సర్వము చేయువాడు. చేతయందు చేత లేనివాడు (ముందు నామములలో కూడ ఉదాహరణలలో నిది వివరింపబడినది).

## 91. ఈశ్వరమ్ (12-7):

ఈశ్వరు డనగా యజమాని, స్వామి, అధికారి, బాబా, ప్రస్తుత కాలమున ఆంగ్లభాషా ప్రభావమున 'మాస్టర్' అనుచున్నారు. సమస్తమునకు పరతత్త్వమే అధికారి. పరతత్త్వమును మించినది లేదు. కాలము, ప్రకృతి, శక్తి, చైతన్యము, ప్రాణము, మాయ ఇత్యాది వన్నియు తత్త్వము నుండి ఉద్భవించినవే. ఈ తత్త్వమునే ఈశ్వరు డందురు. అతడీశ్వరుడు. ఆమె ఈశ్వరి. వారిరువురి క్రీడగ నేర్పడు సృష్టియే ఐశ్వర్యము.

## 92. నిటలాంతరాళ విహారకమ్ (12-8):

ఫాలభాగము నందు విహరించువాడు. ఫాలభాగమున ఇడ, పింగళ, సుషుమ్న నాడీ కేంద్రములు గలవు. అది త్రిగుణముల త్రిభుజము. త్రిశక్తుల త్రిభుజము. త్రిమూర్తుల త్రిభుజము. ఈ త్రిభుజము నందలి కేంద్రమున మూడవకన్ను యున్నది. ఆ మూడవ కన్ను లోపల విహరించు తత్త్వము, పరతత్త్వము. జీవుడు పంచేంద్రి యములను, మనస్సును అధిగమించి బుద్ధి అను అంతఃకరణమున

స్థిరపడి అహంకారమును వర్జించి, ఫాలభాగమున నున్న తత్త్వమును తదేక దీక్షతో ఆరాధించినపుడు త్రిగుణముల కావలయున్న తత్త్వము-కాలమును, దేశమును, కర్మమును బట్టి జీవుని అనుగ్రహించును. అట్లనుగ్రహింపబడినవారు త్రిగుణములను సైతము దాటి పరమానంద భరితమగు పరతత్త్వమును చేరుదురు. పరతత్త్వమును చేరుటకు అనుగ్రహమే ఆధారము. పరతత్త్వ మనుగ్రహించు వఱకు ఆరాధించుచు వేచి యుండుట తప్ప మరియొక మార్గము లేదు. ఆరాధనయందు దీక్ష, ఆర్తి పెరిగినపుడు తన్మయత్వము కలుగును. తన్మయత్వము కలుగుటయే అనుగ్రహము. తన్మయత్వమే పరమ పథమును చేరు మార్గము. తన్మయ మనగా తత్ మయము. అట్టి తన్మయ స్థితి యందు విహరించువాడు సద్గురువు.

*Dhanista Publications*

# OTHER BOOKS THROUGH
## MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKS :**

| | | |
|---|---|---|
| 1. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 2. | THE AQUARIAN MASTER | E/G/S |
| 3. | SOUND –The Key & its Application | E/G/S |
| 4. | ASHRAM LEAVES | E/G/S |
| 5. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 6. | VENUS –The Path to Immortality | E/G/S |
| 7. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 8. | SHIRDI SAI SAYINGS | E/G/S |
| 9. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 10. | THE MASTERS OF WISDOM | S |
| 11. | MEDITATION & GAYATRI | S |
| 12. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 13. | ON HEALING | E/G/S |
| 14. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 15. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 16. | THE AQUARIAN CROSS | E/G/S |
| 17. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 18. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 19. | SRI DATTATREYA | E/G/S/T/HI |

| | | |
|---|---|---|
| 20. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 21. | JUPITER –The Path of Expansion | E/S |
| 22. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |
| 23. | AMANASAKUDU | T/K |
| 24. | VRUTRASURA RAHASYAM | T |
| 25. | THE DOCTRINE OF ETHICS | E |
| 26. | DHANAKAMUNI KATHA | T |
| 27. | ANTARDARSANA DHYANAMULU | T |
| 28. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 29. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 30. | ASANGUDU | T |
| 31. | SARASWATHI - THE WORD | E |
| 32. | MANA MASTARU GARU | T |
| 33. | GEETOPANISHAD (Sankhya Yogamu) | T |
| 34. | GEETOPANISHAD (Karma Yogamu) | T |
| 35. | GEETOPANISHAD (Gnana Yogamu) | T |
| 36. | ‘OM’KARAM | T |
| 37. | JYOTIRLINGA YATRA | T |
| 38. | SRI LALITHA | T |
| 39. | KATHA DEEPIKA | T |
| 40. | MASTER C.V.V. (Birthday Message) | T |
| 41. | MAITREYA MAHARSHI BODHALU | T |
| 42. | MARUVU MAHARSHI BODHALU | T |

| | | |
|---|---|---|
| 43. | DEVAPI MAHARSHI BODHALU | T |
| 44. | HIMALAYA GURU PARAMPARA | T |
| 45. | OCCULT MEDITATIONS | E |
| 46. | Master C.V.V. - The Initiator - Master E.K. The Inspirer | E |
| 47. | SAI SUKTHULU | T |
| 48. | SRI KRISHNA NAMAMRUTAM | T |
| 49. | On Love | E |
| 50. | On Silence | E |
| 51. | On Change | E |

**BOOKLETS :**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME, THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |
| 12. | MARRIAGE - A SACRAMENT | E |
| 13. | MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU | T |
| 14. | POOJA VIDHANA PRASASTYAMU | T |

15. GAYATRI MANTRA PRASASTYAMU T
16. BHARATEEYA SAMPRADAYAMU T

**ధనిష్ఠ ఇతర ప్రచురణలు :**

1. శ్రీ వినాయక వ్రతకల్పము
2. శ్రీ శరన్నవరాత్ర పూజావిధానము
3. శ్రీ హనుమాన్ చాలీసా
4. శ్రీ సూర్య పూజావిధానము
5. శ్రీ శివ హృదయము
6. శ్రీ మహాలక్ష్మి పూజావిధానము
7. శ్రీ వేంకటేశ్వర పూజావిధానము
8. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము
9. పురాణ పురుషుని పూజా విధానము